నందకిషోర్
కవిత్వం

నీలాగే ఒకడుంటాడో వాడు!



SHOUT
SHARE
IT

నీలాంటి
ఒకడుండొచ్చు!


నందకిషోర్
కవిత్వం
నీలాగే
ఒకడుంటాడోవాడు!

Neelage Okadundevaadu
Collection of Poems by
Nanda Kishore

© Poet
October, 2013
1234nandakishore@gmail.com
87128 29212

Address :
Nanda Kishore
C/o Ananda Veda
Venture - 1, SBH Colony,
Hyderabad - 72.

Cover : **Brahmam - Bhavana Grafix**
email : ruganba@gmail.com

Layout : **Sampangi Mallesh**

Printing : Anupama Printers, Hyderabad.
Phone : 040 23391364

For Copies :
Vishalandra, Prajashakthi, Navodaya,
Palapitta & All Leading Book Stalls

Rs. 80/-

e-book available at : www.kinige.com

"I seem to have loved you in numberless
forms, numberless times in life after life,
in age after age for ever"

-Rabindranath Tagore

ఇదీ వరస!

1.	అద్దం	9
2.	వాన	10
3.	జాగర్త	11
4.	సూక్తి	12
5.	ప్రేమ	13
6.	దీపావళి	14
7.	కార్తీకం	15
8.	నువ్వు	16
9.	రహస్యం	18
10.	పూలభాష	19
11.	గుర్తు	20
12.	ముద్దు	22
13.	అకాలం	24
14.	దేహాక్షరం	26
15.	స్వర్గాల చీకటిమీద	28
16.	మసక	31
17.	ఏ జన్మలోనో	33
18.	మరుపు	35
19.	గమనం	37
20.	అమృత	39

21. స్థానచలనం 43
22. దుఃఖగీతి 45
23. ఊరిపొలిమేరలో 48
24. చక్రవ్యూహం 50
25. ఫేక్ ఐడెంటిటి 53
26. జస్ట్ లైక్ దట్ 54
27. మూడు సందిగ్ధాలు 56
28. పిచ్చిరాత 58
29. ఎవరైతేనేం 61
30. అతడొకడే 63
31. నిశ్శబ్దం 65
32. గోస 67
33. ముసురు 68
34. రాఖీ 71
35. అకాలవర్షం 74
36. కాంక్ష 75

❖ పునర్విమర్శ 80
❖ ఊవెలపిల్ల 96
❖ ఒక సంధ్యావస్థ కాలంలోంచి... 110
❖ అనుకోకుండా... 136

Sincere thanks to

My parents: Vijaya & Sadanandam
Artists: Victi & Olga

అద్దం

పగిలినా
పగలకున్నా

ప్రతిబింబించడంమాత్రమే
నీ గుణమైనప్పుడు

ఎవరో విసిరిన రాయిని చూసి
ఎందుకంత కోపం నీకు?

నీ గురించి నీకే తెలియంది
ఇంకేదన్నా మిగిలే ఉందా?

వాన

కురిసినప్పుడు
ఏ రంగూ లేదు

తడిపినపుడేమో
మట్టిరంగు

నీలాగే వానకీ
నేనేంటో తెలుసు.

స్వచ్ఛంగా లోతులకి
ఇంకిపోయింది.

జాగర్త

దారం తెగిన గాలిపటమొకటి
ఆకాశంలో గిరికీలు కొడుతూ

తెలిసో తెలియకో గతిలేకో
రెక్కల్ని తెంపుకుంటూ పైకిపోతోంది.

ఆకాశాన్ని అందుకుంటుందో లేదో
అదంతా నీకెందుకు?

ఇప్పటికైతే నువ్వు
అటువైపుగా ఎగరబోకు!

సూక్తి

రెండు పేలవమైన దేహాల మధ్య
ప్రేమ నిక్కచ్చిగా నలిగిపోతుంది.

రెండు అపసవ్యమైన కోరికల మధ్య
యవ్వనం పూర్తిగా వాడిపోతుంది.

గాలికోణాల్లోన ఊగిసలాడే కల
ఎప్పటికీ ఒంటరిగా మిగిలిపోతుంది.

చీకటి ప్రపంచాన వర్తనమయ్యే కాంతి
నేరుగా గుండెల్ని చీల్చిపోతుంది.

ప్రేమ

నీ పాటలు పాడేపూట
అమ్మవి.

నా పాటలు వినేపూట
పసిపిల్లవి.

ప్రేమలేదని
ఎందుకంటావ్?

మనకంటే హాయిగా
ప్రేమించుకుందెవరు?

దీపావళి

తారాజువ్వలు వెలుగుతాయ్–
వెలుగుల మీద ప్రపంచం ఆరకముందే
నీ రంగురంగుల నవ్వు
నాలోకి ఇంకిపోతుంది.

భూచక్రం తిరిగిపోతుంది–
ఋతువుల మీద యేడాది రాలకముందే
నీ మిణుకుమనే మాటలు
గుండెలపై చిగుర్లువేస్తాయ్.

చీకట్లోంచి చీకట్లోకి
శూన్యలోంచి శూన్యంలోకి
వెలుగుదారుల మీద మన ప్రయాణం.

సర్లేపోనీ
ఎప్పుడో ఒకసారి
చిక్కటి అమావాస్యపూట
కాకరపువ్వొత్తులవోలె
మళ్ళీపూస్తాం మనం!

కార్తీకం

గోర్వెచ్చటి గాలి.
కొంచెం తేమ. కొంచెం వేడి.
వెన్నెలనిండా పరిచిన అందం.
చీకటినిండా వెలిగే దీపం.

చందమామ
పువ్వులయ్యి రాలుతున్నదో..

కనిపించని మంచు.
కొంచెం సిగ్గు. కొంచెం భయం.
రాత్రినిండా పరిచిన దేహం.
మనసునిండా కురిసే ప్రేమ.

కలువలాగ
నవ్వుతూనే పిలుస్తున్నదో..

ఏమో! నన్ను వెలిగించుకుంటాను.
కోనేట్లో ఇద్దరం కలిసిపోతాము.

నువ్వు

1
నువ్వు ప్రపంచం
కాదనేదెవరు?

మూడొంతుల కన్నీళ్ళు
ఒకవంతు దేహం.

2
మనసులో, హృదయంలో
గడ్డకట్టిన రెండు ధ్రువాలు కూడా!

3
పర్వతంలా, మైదానంలా
ఉనికినే వెతికేటి లోయలా

జీవనదిలా, సముద్రంలా
జీవితం మరిపించు యేటిలా

రూపాంతరాలలో
దూపకేడ్చి

బాధలకు బానిసై
బతుకునీడ్చి

4
ఆకాశాన్ని మించు ఆశలన్నీ
ఋతువుకో తీరుగా సర్దుకుంటూ

5
నువ్వే ప్రపంచం!
కాదన్నదెవరు?

అనంతాల క్షితిజరేఖల్లో
అంతులేనిది దు:ఖ మధ్యరేఖ.

రహస్యం

చిన్న చిన్న తుంపర్లు
అణువణువుని తాకి
హృదయాంతరాలలో
ప్రాణంపోస్తాయ్.

చిటపట శబ్దాలన్ని
విశ్వంలోకి పాకి
గుండెని శూన్యంలోకి
అనువాదం చేస్తాయ్.

చిలిపి ముసుర్లలో
చీకటినీ, వెలుగునీ
అర్థంచేస్కోగల్గే
రహస్యం ఉంది.

వానెందుకొస్తుందో
నన్నొక్కన్నే అడుగు.
అనంతపు మేఘం
నాకు ప్రియనేస్తం!

పూలభాష

పుప్పొడి రాలకముందు
నిజంగా
అపరిచితులం.

ఎందుకు పుట్టామో
ఎందుకు పూసామో
ఎన్నడూ మాట్లాడుకుంది లేదు.

మన మాటల్తో సీతాకోకలు
పాటలు కట్టుకున్నా..
పక్కనే నువ్వుంటావనే
సంగతేదీ తెలీలేదు.

పోనీ..
అయిందేదో అయింది.
వీచే యవ్వనాన్ని
ఇకపై రోజూ మన్నిద్దాం.

సరేనా?

గుర్తు

1
నిశీధిని
నిన్ను
ఒకేసారి చూసాను.
ఇన్నాళ్ళు వెలుగులో లేని అందం
ఈ చీకటిసొంతం
కాదంటావా?

2
నువ్వెందుకిలా ఉన్నావో
అర్థం కాలేదు.

గాలికి ఊగే చెట్టు కొమ్మని
యేటి గట్టుపై నడిచే తాబేలుని
గుడ్డులోంచి తలెత్తిన పిట్ట పిల్లని
చాలా మందిని అడిగొచ్చాను..

సమాధానం రాకున్నా..
నువ్వెప్పుడూ నాకిష్టమే!

3
నీకు రెక్కలున్నాయని తెలిసి
పక్షివనుకున్నా.. నిజం.
ప్రవాహానికి ఎదురీదే
చేపవని తెలిసీ
ఇప్పుడు కూడా
ఎగరమంటానా? చెప్పు..

4
నేల చేరకుండా ఆవిరైన చినుకుని
పూసీపూయగానే కోయబడ్డ పూవుని
కాంతి వెదజల్లుతూ పేలిన నక్షత్రాన్ని
నిన్ను..
ఇవ్వాలెందుకో
ఎవరూ చూడకుండా
ఒక్క అణువునీ వదలకుండా
హత్తుకోవాలనిపిస్తుంది.

5
నువ్వు చుక్కల్లో హాయిగా
తేలిపోతావనుకున్నా..
నువ్వు ఆకాశాన్ని పూర్తిగా
గెలిచేసావనుకున్నా..
నువ్వు వెన్నెల్ని నిండుగా
నింపుకున్నావనుకున్నా..

నీ చేతుల్ని తాకితే తప్ప
ఆ మచ్చలు
...గుర్తుకురాలేదు!

ముద్దు

నువ్వలా మోహంతో ముద్దుపెట్టుకుంటావో లేదో
కొండవాలొక దారిలా కనిపిస్తుంది.
తేలిపోయే ఆకాశాలు
పూలనవ్వుల్ని విసిరేయడం మొదలెడతాయ్.
కాంతులు నా ప్రపంచమంతా నర్తనం చేస్తాయ్.

నీ శ్వాసదో, అడుగుల సవ్వడిదో తెలీదు.
రవ్వంత సడి
భువనాల్ని, హృదయాన్నీ దాటి
శూన్యాన్ని కప్పుకున్న మనసులోకి ప్రవేశిస్తుంది.
ఆనందం ఆకాశమంతా వీస్తుంది.
ఆత్మ తనని తాను గుర్తు చేసుకుంటుంది!

నువ్వు హత్తుకున్న ప్రతిసారి
ఇప్పటి నేను
ఎప్పటి మనలోనో కలిసిపోతాను

నిన్ను మరింతగా దాచేసుకుంటూ
నన్ను మరింతగా వదిలేసుకుంటూ

నువ్వూ నాలాగే మిగిలున్నావేమోనని
ప్రతివిరామంలో పరీక్షిస్తాను.
ప్రతీయుగాన్ని లెక్కించుకుంటాను.

నాలోంచి నీకొక వంతెన వేసి
నాపైన నేనే నడచిపోతాను.

అకాలం

రమ్మంటారుగానీ..

దు:ఖపునీటితో కాళ్ళుకడిగి
కన్నులకాంతితో హారతిపట్టరు.

రాత్రికి పొంగే పూలవాగులో
నాతోపాటే కునుకుతియ్యరు.

❖❖❖

పొద్దెక్కి లేస్తాను.
చెంపల మీద ఒక ముద్దుతడి.

గాలికో, వానకో
కలలు వెలిసిపోతాయ్.

రాత్రి గీసిన కలని మలిపి
మళ్ళీ గీయడం మొదలుపెడతాను.

పువ్వులు ఉప్పొంగే అర్ధరాత్రిలో
అంతా ఒకసారే పూర్తిచేయబడుతుంది.

❖❖❖

వద్దంటారుకానీ..

రేవుకు చేర్చే తెరచాపల్నే
కప్పుకొని నిదరోవడం మానలేను.

చావుని తీర్చే కెరటాల తడిని
చుక్కానికద్దడం ఆపలేను.

దేహాక్షరం

నిరామయశోకం నీలోప్రవహించే సమయం
మోహిని స్పర్శల్లో మోసపోయింది.

నిర్లిప్త ప్రపంచాన్ని పరిచయంచేసి
కాలం చీకట్లో కలిసిపోయింది.

నేలకీ నీకున్న దూరం మొత్తం
భగభగామండి భగ్నమౌతోంది.

పూలకీ నీకున్న పోలికని చూసి
ఆకాశం హాయిగా నవ్వుకుంటోంది.

దు:ఖితుడా!

విసురుగా నువ్వలా విసిరేస్తూ ఉండకు.
క్షణాలిపుడు సూర్యరశ్మికి ఆనవాళ్ళు.

బంగారువన్నె ఏడుపుకాంతితో
పసితనపు గురుతుల్లో ఆడుకుంటున్నాయ్.

నిజం నీ దేహాక్షరంలో
కాలిపోనిదై
లిఖించబడి ఉంది.

వెళ్ళు! వెన్నెలయేటిలో స్నానం చేసి
లేలేత పువ్వులా విచ్చుకోపో!

స్వర్గాల చీకటిమీద

1
ఎవరిదైతేనేం?

జాగ్రత్తలేని ఊహల్లోంచి
జారిపడ్డ రాత్రికి గుర్తు.

నీలాగా, నాలాగా
ఒక పసిప్రాణం.

చూస్తూ చూస్తూ
ఎలా చంపమంటావ్?

2
తెలిసిందా?

రాత్రులు నువుమోసిన
స్వర్గాలన్నీ

భారంగా తేలిపోయే
నల్లమబ్బులు.

నిజమైన స్వర్గం ఒకటి
ఖచ్చితంగా వేరే ఉంది.

3
ఏడుస్తావెందుకు?

ముడుచుకున్న పసివేళ్ళన్నీ
మృదువుగా కదిలినందుకో

తెరుచుకున్న కళ్ళ వెలుగులో
శూన్యరాశి పరిచినందుకో

4
సున్నితమైన ఓదార్పు మాటతో
ఎముకలు చిట్లేటి
శబ్దాలు వింటూ

మరలిరాని ప్రాణాల ధ్యాసలో
దీనంగా భారంగా
పాపాన్ని కంటూ

5
రా! ఇలా!
శుభ్రంగా
చేతులు, మనస్సు కడుక్కో.

స్వర్గాల జలపాతాల్లో
నీటితుంపరలు పిల్లలు

స్వర్గాల చీకటి మీద
నిప్పు తునకలై మెరిసిపోతారు.

6
పిల్లలకేదీ అంటదు!

ఆకాశాలమీద
ఆడుకుంటారు.

ఆకాశమై
వాళ్ళు బతికిపోతారు.

నువ్వే రక్తమని
తెలిసినా లేకున్నా

7
పిల్లలు దోసిళ్ళతో
నక్షత్రాలు చల్లుతారు.

నూరేళ్ళు బతకమంటూ
నిండుగానే దీవిస్తారు.

మసక

1
దేహం ఒకటే

మిణుగుర్లు తేలుతున్నట్టు నీకూ
నక్షత్రం ఆరినట్టు నాకూ

సంధ్యావస్థకాలంమీద
నిలుచోని మనుషులకి

అందరికీ

2
దారులు రెండే

ఒకటి ప్రదక్షిణం
ఒకటి నమస్కారం

సంధ్యావర్ణ గగనం మీద
చీకటిని అద్దటం

తప్పకున్నా

3
తృప్తి శూన్యం

కొంచెం అశాంతి
కొంచెం అలసట

సంధ్యారాగ మోహార్చనల్లో
దయలేనివాళ్ళమై

మిగిలిపోతాం.

ఏ జన్మలోనో

అంతా అయిపోయిందని
అనుకున్నప్పుడు, తనే-

పసిపాపలా, పసిచూపుతో
అమ్మకన్నుల్లోని అనురాగం వర్షిస్తూ
కాంతిపూల సరాగాలకి లయబద్ధంగా అడుగులు వేస్తూ
నగ్నదేహంతో, నగ్నహృదయంతో
ఏ జన్మలోనో నన్నుకన్న అమ్మలా..

❖ ❖ ❖

ఒక వెచ్చటి స్పర్శ
రెండు మృదువైన ప్రశ్నలు
ఆపై

పూలురాలేటి చప్పుడు చేస్తూ
కొన్ని నిజమైన
కరుకైన
సమాధానాలు
అంతే!

❖ ❖ ❖

అంతా అనుకున్నదే అని
తెలుసుకున్నాక
తనే–

యవ్వనిలా, మోహినిలా
ఆచ్ఛాదనలేకుండానే ప్రపంచమంతా తిరుగుతున్నట్టూ
పాదధూళితో రాల్చిపోయిన వెచ్చటి స్పర్శనే
గుర్తుంచుకున్నట్టూ
భగ్నహృదయంతో సవ్వడి చేస్తున్నట్టూ
బాధాతప్తదేహాన్ని భారంగా మోస్తున్నట్టూ

❖ ❖ ❖

ఓయ్!
'మనిద్దరికీ అంత చనువుందా?'

ఏమో! ఎన్ని జన్మలకావల కలిసిందీ
ఏ చీకటిరాత్రిపై పరుచుకుందీ
ఏ దెసలపాపిటమీద
ఎర్రటిరంగులో ఉదయించిందీ..
ఏదీ ఎందుకో గుర్తుకులేదు!

సరే!
'ఎందుకు నువ్వంత అతిగా మాట్లాడ్తావ్'

ఏమో!
ఎవరి పుణ్యాన గమ్యం మారిందో
ఎవరి అడుగులకింద గుండె విచ్చుకుందో
ఎవరి లాలనకి కవిత్వం చిప్పిల్లిందో..
ఏదీ ఇప్పుడప్పుడే గుర్తుకురాదు!

మరుపు

ఓకానొక అకాలంలో
ఒంటరిగా కలిసాం మనం..
నేను గుర్తున్నానా?

ఒకానొక అకాలంలో
ఒంటరి ఇసుకరేణువులమీద
సెలయేటిలాపారి, ఆకాశాన్ని దాచి
సూర్యుని కూడా దక్కించుకున్న గర్వంతో
ఒడ్డునపడిఉన్న పడవలన్నిటినీ
ఒక్కసారిగా పక్కకితోసాం మనం.
ఓయ్! నిన్నే..
నన్నానవాలు పట్టగలవా?

ఒకానొక అకాలంలో
పసితనపు అడుగుల్ని చెరిపి
అలలుగా నెమ్మదిస్తూ, ఎడారిలా ఎండిపోతూ
దాహాన్ని కూడా తీర్చుకోలేని శాపంతో
చెలిమెతవ్విన చేతులనిండా
ఇసుకరాత్రులు మోసుకొచ్చాం మనం.

నిన్నేనోయ్!
నన్ను పరీక్షించి చూడగలవా?

చేపలా తుళ్ళేటి పరువాన్నంతా
దేశాలమీదుగా విసురుకున్నవాళ్ళం.
వానల కురిసేటి యవ్వనపు కోరికని
సముద్రపు అంచులకు వదులుకున్నవాళ్ళం.
ఒరుసుకున్న రాళ్ళమీదా ఓడించే నీళ్ళమీదా
సంతకాలు చేసినవాళ్ళం. సంతోషం పొందినవాళ్ళం.

చెప్పు! ఏదో ఒకటి..
అంతా అర్ధమవుతోందనో
అప్పటిలా ఉండలేననో చెప్పు.
అసలే తెలీదనో
అణువంతైనా గుర్తులేదనో చెప్పు.

నిశ్శబ్ధాన్ని వింటూ
రక్తం ఇంకిపోకముందే

నేనేద్వనుగాని
ఓయ్! నిన్నే..

గమనం

కాలేగచ్చుపై కుంకుడు గింజలు గీకి
నాకు తెలీకుండా నువ్వు చురుగ్గా అంటించినపుడు

పరికపొదల్లో గుచ్చిన ముళ్ళని
నొప్పి తెలీకుండా నేను సుతారంగ తీసినపుడు

ఎరుకే తెలీనంతగా ఎగురుకుంటూపోయి
పంటకాల్వలపైన పరుగెత్తినపుడు

ఎర్రటిమధ్యాహ్నం మనం భూతద్దపుచేతుల్తో
రెండు పచ్చి అగ్గిపుల్లల్ని వెలిగింపజూసినపుడు

కళ్ళకి తెలీని కాంతిభాషతో
కాళ్ళకి తెలీని స్పర్శభాషతో
ఇద్దరం నిశ్శబ్దంగా మాట్లాడుకున్నపుడు
మాట్లాడ్తూ మరిచిపోయినపుడు
మాట్లాడీ మాట్లాడీ కరిగిపోయినపుడు..

ఓహ్!
ఒక పసికాలం పరిసమాప్తమయ్యేలోపు
ఒక ఎండ మనల్ని పరిపూర్ణుల్ని చేసింది.

❖ ❖ ❖

తెల్లటి మేఘాల పరిమితుల్ని దాటి
నీ హృదయాలు నాపై వర్షించినపుడు

కాగితప్పడవలో కదలకుండా కూర్చొని
నే ప్రవాహాల్ని దాట ప్రయత్నించినపుడు

ముసురుపట్టిన రాత్రి ముద్దులనిద్రలో
మురిసిపోతూ నిన్నుకలగన్నపుడు

కలగంటూ కలగంటూ కౌగిళ్ళవాగులో
కనపడకుండానే మునిగిపోయినపుడు

చేతులకి చెందని సవ్వడి వింటూ
చేతలకి అందని సందేశం రాస్తూ
ఇద్దరం మధురంగా పాటపాడినపుడు
పాడుతూ పరవశించినపుడు
పాడీ పాడీ గొంతు మూగబోయినపుడు..

అహ్!
ఒక యవ్వనం పూర్తిగా తడపకముందే
ఒక వాన మనల్ని ఆకాశాల్ని చేసింది.

❖ ❖ ❖

మంచుదారుల్లో అరచేతులు రుద్దుతూ
వెచ్చటి జ్ఞాపకాలపై అడుగేసుకుంటు

చల్లటి శీతగాలికి దేహాల్ని అడ్డేస్తూ
మనల్ని మనంగా కాపాడుకుంటు

బాసలు, బాధ్యతల్లేని కొత్తలోకం ఒకటి
మనకోసం మనం సృష్టించుకుంటు

మనసు, హృదయం తెలియని మార్మికజ్ఞానంతో
మనల్ని మాత్రమే మిగుల్చుకుంటు

చరిత్రలడగని ఊహల పరంపరలో
గణితాలెరగని చీకటి మైదానాల్లో
ఇద్దరం హాయిగా ఆడుకుంటు
ఆడుతూ అలసిపోతు
ఆడుతూ ఆడుతూ అంతమయిపోతు..

__!

ఆశ్చర్యానికి పదాలు లేని చలిలో
జీవితం గుట్టుగా మగించాలని ఉంది.

అమృత

ఎంతకీ తీరనిదాహం..
పంచే నీ పెదవులవల్లో
పెరిగే నీ ప్రేమవల్లో
అర్థంకాదు.

ఎన్నడూ విడవని మోహం..
కలిగించే నీ అందాన్ని
పెంచే నీ చూపులని
నిందించలేను.

ఎంతపాడినా నీపేరే
గానంలో అమృతమై
పాటల్నీ, నన్నూ
ప్రతిరోజూ బతికిస్తుంది.

ఎంతరాసినా
నిన్ను చేరాకే
నా అక్షరాలు, ఆనందాలు
అనంతమవుతాయ్.

ఎప్పటివరకి మనమిలా అంటే
సమాధానం లేదు.
ఎప్పటికైనా విడిపోతామనే
భయమూ లేదు.

అవును..

నువ్వు నేను ఒకటే అయినప్పుడు
నీలో నాలో ఉంది ఒకే ప్రాణమైనప్పుడు
నువ్వు నన్నూ నేను నిన్నూ
అడగాల్సింది ఏమీ లేనప్పుడు
ఎందుకు భయం?

అవును..

అడగకుండానే నీ బాధని పంచుకున్నప్పుడు
నీదంతా నాదే అనుకున్నప్పుడు
ఇంకా ఒకరికొకరం చెప్పుకోవాల్సింది
ఏముంటుంది?

బాధ నీవల్లే అని అనుకోవడమే
మన సంతోషం.. కాదంటావా?
లేదంటే ఇన్నాళ్ళూ దుఃఖం ఎందుకు
మన దరికి చేరలేదు?

అవును.. బహుశా ఈ జ్ఞానమే
నిన్నూ నన్నూ నిత్యసంతోషుల్ని చేసింది.

బహుశా ఈ నిశ్చలత్వమే
నిన్నూ నన్నూ దేవతల్ని చేసింది.

మనల్ని మనుషులకి, దుఃఖానికి
అతీతుల్ని చేసింది.

అవును.. ఈ పొద్దు మనం
అమృత హృదయులం.

స్థానచలనం

బిజార్లు వెక్కిరిస్తాయ్.
కాలువలు అడ్డమొస్తాయ్.
గోడలు వాటేసుకుంటూ పోవద్దంటూ
కన్నీళ్ళు పెడతాయ్.
చెట్లూ, మెట్లూ.. చేతులు చాస్తూ
చివరి ముద్దులకి జోలెలుపడతాయ్.

నిన్నటిదాక లాలపోసిన నల్లమబ్బు
నిన్నటిదాకా ఊయలూపిన చల్లగాలి
నిన్నటిదాక నీడనిచ్చిన ఆకాశం
అన్నీ ఒక్కసారే పరాయివనిపిస్తాయ్.
అన్నీ ఒక్కసారే ప్రవాసాన్ని
నెత్తిన రుద్దుతాయ్.

పగటికీ రాత్రికీ తేడా ఉండదు.
చీకటి గట్టిగా విసిరివేయబడ్తుంది.
ఉక్కపోత ఎక్కువై ఉక్కిరిబిక్కిరి చేస్తుంది.
వెన్నెలకసలే దయ ఉండదు.

సరిగ్గా నిజాయితీగా చెప్పాలంటే
కావాల్సినదేదీ మిగిలుండదు.

కాస్త ప్రేమ, కొంచెం ఓదార్పు
మృదువైన స్పర్శ, ఆత్మీయ కరచాలనం
ఏదీ ఇకపైన అగుపించదు.
ఎవ్వరూ నీలోకి చూడలేరు.
మునుపటి కాలమంతా ముసలిదైపోతుంది.

కోల్పోయిందేంటో తెలుసుకునేలోపే
కొత్తదేశం ఒకటి కోసుకుపోతుంది.
జ్ఞాపకాలన్నీ నెత్తుటితో తడుస్తాయ్.
గాయమైన యదకెప్పుడు సాంత్వనుండదు.

ఏకాంతం ఒంటరిగా ఏడ్చేలోపే
ఎక్కడినుండో ఒకపాట
త్వరత్వరగా రమ్మంటు పిలుపునిస్తుంది.
బతకటం ఇంకొంచెం నేర్వమంటుంది.

ఎడబాటుకోర్చే ఎదురేగుకుంటూ
ఎటో ఓ దిక్కుకి ఎగరమంటుంది.

దుఃఖగీతి

ఒక మూల కూర్చోనివ్వదు.
ఒకచోట నిల్చోనివ్వదు.
దొర్లిపోయే కాలం వెనక
పొర్లుకుంటూ ప్రవహిస్తుంది.
గుండెపగిలే చప్పుడు చేస్తూ
గుక్కపట్టే గానం చేస్తుంది.
దుఃఖలయ సాగినంతసేపు
దుఃఖగీతి వినిపిస్తుంది.
దుఃఖం నీ సహచరి.
దుఃఖం నీ ఆత్మ.

నిర్నిద్రరాత్రుల మధ్యలో
నిశ్శబ్దంగా వచ్చెళ్తుంది దుఃఖం.
నిర్లిప్త నిమిషాలేవి
కనబడకుండా దోచుకెళ్తుంది దుఃఖం.

దుఃఖానికి భేదంలేదు.
చీకటి వీధుల్లో నిన్ను
నగ్నంగా పరుగెత్తిస్తుంది.

దుఃఖానికి కోపం లేదు.
చీకటిదారుల్లో నిన్ను
నగ్నంగా హత్తుకుంటుంది.

దుఃఖానికి ఆశల్లేవు.
చీకటి హృదయంలో నిన్ను
నగ్నంగా ప్రతిష్టించుకుంటుంది.

దుఃఖానికి గమ్యంలేదు.
చీకటి ప్రదేశాల్లో నిన్ను
నగ్నంగా మలుపుకుంటుంది.

దూరమైతే మిగిలిపోతుంది–

జీవనరేఖల్తో గిరిగీయలేని
కాంతిలెక్కల్లో కొలవడం వీలుకాని
ఒకేఒక దూరమైతే
ఎప్పటికీ మిగిలిపోతుంది.
నీకూ దుఃఖానికీ మధ్య
దూరం లేదని అనలేను.
దుఃఖం నీకు వికాసం.
దుఃఖం నీకు ప్రయాణం.

భారమైతే మిగిలిపోతుంది–

చిరునవ్వుల్తో తూచలేని
చిగురించే వేళ్ళతో ఎత్తలేని
ఒకేఒక భారమైతే
ఎప్పటికీ మిగిలిపోతుంది.

నీలో దుఃఖమంతా
తేలికపడ్తుందనుకోను.
దుఃఖం నీ కనురెప్పలపై
వెచ్చనైన కన్నీటి భాష.

ఎంత విషాదం కవిత్వమవుతుందో
ఎవడికి తెలుసు బుల్‌బుల్?
పరుచుకున్న నవ్వులనిండా
కప్పబడ్డ దుఃఖపు మరకలు..

ఊరిపొలిమేరలో

తిరిగిన దార్లన్నీ వెనక్కి పోతాయ్
కాళ్ళు నేలమీదవాలగానే–
ఊరిమీది దుమ్ము ముద్దు పెడుతుంది.
ఊరిముచ్చట్లన్నీ మనసు కదుగుతాయ్.
ఊరివాసన కొత్త ఊపిరిపోస్తుంది.

జరగని పనులన్నీ పక్కకి జరుగుతాయ్
కళ్ళలో పచ్చదనం నిండగానే–
పిట్టలు నా గొంతుకలో దాహం తీర్చుకుంటాయ్.
పశువులు నా నడకలో వేగం నేర్చుకుంటాయ్.
మనుషులు నా రాకతో చిర్నవ్వుతారు.

❖❖❖

బయటకు వేసిన ఒక్కో అడుగుకీ
ఒక్కో మిత్రుడూ దర్శనమిస్తాడు.

ఒకడు సిగరెట్ వెలిగించి
ఊపిరితిత్తుల్లోకి బాల్యాన్ని ఊది
గుండెపొరలపైన చురకపెడతాడు.

ఒకడు సీసామూతలోని
మాయభూతాన్ని పిలిచి
కోల్పోయిన సంపదనంతా తెచ్చిపెడతాడు.

❖ ❖ ❖

లోపలికి చూసిన ఒక్కో నిమిషం
ఏదోజ్ఞాపకం రమ్మని పిలుస్తుంది.

ఒకరు సూర్యాస్తమయంలో గట్టిగా హత్తుకొని
ఉదయాన్ని దేహంపై పరచిపోతారు.

ఒకరు సూర్యోదయంలో గుట్టుగా ముద్దాడి
సాయంత్రపు ఊహల్ని చల్లిపోతారు.

❖ ❖ ❖

నేను ఊరికే ఉండలేక
తొలియవ్వన గర్వంలోకి తొంగిచూస్తాను.
దూకిన గోడలమీంచి జారిపడతాను.

స్వప్నాలు కొన్ని ధ్వంసమయ్యాక
సత్యాలు కొన్ని స్థాపితమయ్యాక
ఊరిపొలిమేరలో కూలబడతాను.
ఊరిపొలిమేరలో కూలిపోతాను.

ప్రియురాండ్ల చేతుల్లో పిల్లలు నవ్వుతారు..
నెలవంక నెత్తిమీద నక్షత్రం వెలుగుతుంది..

చక్రవ్యూహం

1
ప్రతి అనుభవం నేర్పేదే.
ఎంతో కొంత.
కొంచెం జ్ఞానం.
అంతే అజ్ఞానం.

ప్రతి మనిషిదీ స్వార్థమే.
ఎంతో కొంత.
కొంచెం నీకోసం.
కొంచెం తనకోసం.

2
అవకాశం ఉన్నన్ని రోజులు
నియమాలతోటి సావాసం.

తీరికలేకా, ఓపికలేకా ఒకరోజు–
అన్నీ మలిపి ఆనందిస్తాం.
ఒకే జీవితమని గుర్తించేస్తాం.

ఒక్కరోజన్నా గడుస్తుందో లేదో!

ముందే చేస్తే బాగుండని ఎవడో
భుజాలుపట్టుకుని ఊపేస్తాడు.
తలలోకి దూరి గోలచేస్తాడు.

ఇంకేం!
ఓ కొత్త పత్రం తయారవుతుంది.
నువ్వెప్పుడు ఆనందించవు.

3
అభిమానం దొరికినన్ని రోజులు
మనుషుల మీద వీరంగం.

పొడిబారి, పొగరు తగ్గి ఒకరోజు
ఎవరూ లేరని ఏడ్చేస్తుంటాం.
బతుకిదికాదని తేల్చేస్తుంటాం.

కన్నీటి చుక్కైనా రాల్తుందో లేదో–

హత్తుకుని తిరుగుదాం రమ్మంటు ఎవరో
తెగిపడిన చేత్తో పిలుస్తుంటారు.
పగిలిన గుండెతో పాటకడతారు.

ఇంకేం!
ఓ కొత్త భయం పరుగుతీస్తుంది.
నువ్వెప్పుడు కలిసిపోలేవు.

4
సంజాయిషీ ఇవ్వాల్సిన నిమిషాలు
ఎప్పటిలాగానే మిగిలే ఉంటాయ్.
వినాల్సిన మనుషులుండరు.
ఎక్కడున్నారో తెలిసీ–
నడిచే ధైర్యం నీకూ ఉండదు.

సందేహాలు తీర్చాల్సిన మనుషులు
ఎప్పటిలాగానే మిగిలి ఉంటారు.
చెప్పాల్సిన నిమిషం మిగలదు.
ఎక్కడికిపోయిందో తెలిసీ–
వెతికే కోరిక నీకూ ఉండదు.

5
ఒప్పుకుంటానంటే నిజం చెప్తా!

రోజోసారి రోజుల్ని లెక్కేస్తామేగాని
నీకూ నాకూ, మనలాంటి అందరికీ
సుఖానికీ, సంతోషానికీ తేడా తెలియదు
అవసరానికీ, ఆశకీ గిరిగీయడం తెలియదు.

ఋతువుకో తీరుగా దుప్పట్లు మారుస్తాంగానీ
నీలో నాలో మనలాంటి అందరిలో
ఊహల కొత్తదనం–ప్రయత్నాలకు అంటదు.
నవ్వుల తడితనం–గుండెలకు తాకదు.

ఫేక్ ఐడెంటిటి

నా మాటల్ని దాచుకోవాలనుకున్నావు
మొదటి ప్రశ్నకే తడబడ్డాను
గాజు పాత్రపగిలిపోయింది
అతికించే అవకాశం లేదు

నా అక్షరాల్ని నింపుకోవాలనుకున్నావు
దోసిట్లోకి ఆహ్వానించావు
ప్రవాహం దారి తప్పింది
మళ్ళించే శక్తిలేదు

నా హృదయాన్ని హత్తుకోవాలనుకున్నావు
హృదయం నుండి పిలుపొచ్చింది
నన్నెవరో బంధించారు
విడిపించే మనుషుల్లేరు

"ఐయామ్ నాట్ ఫేక్" అని
గట్టిగా అరవాలనిపిస్తోంది..
నువ్వు గుర్తొచ్చిన ప్రతిసారీ!

జస్ట్ లైక్ దట్

నువ్వు తీరంలో తీరిగ్గా తిరిగేస్తుంటే
నే చెరువుగట్లపై అడుగులేసాను

నీ సంద్రంలో ముత్యాలు, గవ్వలు, శంఖాలు
నా చెరువులో ఖాళీ ఖాళీ నత్తగుల్లలు..

అక్షరాలో ఆలోచనలో
ఎవరు చెప్పారో..
నీకు నాకు పోలిక ఉందనుకున్నాను.

నిన్ను కలవాలంటే
నదినో ప్రవాహాన్నో కావాలని
నిన్నటిదాక గుర్తురాలేదు.

నిరంతరం హోరెత్తే నీకు
నిమ్మలంగా గాలికూగే నాకు

నిజమే బహుశా పోలికే లేదు.

నువ్వు నీలాకాశాల్ని కప్పుకున్నపుడు
నేను మేఘాల్ని తారల్ని చదువుకున్నాను.

నీకు డాల్ఫిన్లు, టూనాలు, సమస్త కాంతిచరాలు
నాకు పరిగెలు, పాపెర్లు, నల్లచేపలు, గంగరొయ్యలు..

అవసరమో, అవకాశమో
ఏది సరేనందో..
నీతో పోటీకి ఒప్పుకున్నాను.

నిన్ను గెలవాలంటే
బలం బలగం ఉండాలని
నిజంగా అపుడెందుకో అనిపించలేదు.

అలల్ని విసురుతూ కవ్వించే నీకు
సొగసుగా కదులుతూ ఆహ్వానించే నాకు
నిజమే బహుశా పోలికే లేదు.

మూడు సందిగ్ధాలు

1
తీవ్రమైన దేహాకర్షణచేత
భూమిచుట్టూ
సూర్యుడు తిరుగుతున్నప్పుడు

తెరిచే ఉన్న గదిలో
కట్టిపడేసినందుకో

తెంపుకున్న బంధాల్లోంచి
ముక్కలుగా తెగిపడ్డందుకో

ఎందుకు మొదలెట్టానో..

మళ్ళీ
మళ్ళీమళ్ళీమళ్ళీమళ్ళీ

ఆమె,నేను
నేను,ఆమె

ఛ!
Perversion appears to be
honesty for a pervert.

2

అయిపోయింది.
అనుకున్నదనుకున్నట్లే
అతి దారుణంగా–

ఎప్పటిలాగే
నేనొక్కన్నే మిగిలిపోవడం
అనుకోకుండానే జరిగిపోయింది.
It seems honesty in perversion and
perversion in honesty exist.

3

అవును!
Let me be truthful atleast this time.

ఎవరి చేతుల్లో ఆయుధాన్ని నేను?
ఎవరి ఆశకి వారసున్ని నేను?

వలల్లో ఈదేంత వెర్రి ఉన్నా
ఉచ్చుల్లో చిక్కేంత పిచ్చిలేని

ఒక నిరాసక్త జీవితాన్ని
కొన్ని భారమైన తెలివితేటల్ని
మోసుకుపోతూ..

Let me confess..
Neither honesty nor perversion
nothing can give us complete satisfaction.

పిచ్చిరాత

1
ఔరౌరా!
ఎంతటి మోసగాడవు?

దృశ్యాదృశ్య సంకెలలుతెగి
నిస్సందేహస్వేచ్ఛావాయువులలో
ఏకాంతముగా సంగమించు
ఎడారిసమయాన

నగ్నంగా నర్మగర్భంగా
సర్వకాల సర్వావస్థలయందునూ
సంతోషముగా ఉందునని
సహచరులందరికీ బాసజేసి
ఇప్పుడీ నిహితనిశాంతనిశ్వాసనాన

దృగ్గోచరకాంతిపుంజములేవీ
మనఃపటల సూక్ష్మద్వారములగమించ
వీల్లేదని స్వయంవిధించుకుని

ఒద్దికగా మరణిస్తుంటివి.
ఇదా ధర్మము?

❖ ❖ ❖

పెళ్ళి చేస్కుందా?
నీకుద్యోగంలేదనేనా?
రాసిన కవితలు, పాడిన పాటలు
రామప్ప గోడలమీద గీసుకున్న గీతలు
మీ ఊళ్ళో రాముని గుళ్ళో
కలిసి కొట్టిన కొబ్బరికాయలు..
ఏవీ గుర్తులేవంటన?

2
ఔరా!

ఎన్నిదివాలెన్నిరాత్రులెన్నియుగములెన్నిలయల్
ఎన్నిసిరులుఎన్నివిధములెన్నివిషయలోలత్వాల్
ఎంతకాలమెంతగానమెంతప్రాణమెన్నిక్షణాల్
ఎంతద్రోహమెంతద్వేషమెంతచూసిజడిసినావు

అతి సాధారణమగు
అణువంత విషాదమునే
అనంతమని వర్ణిస్తుంటివి.
ఇదా న్యాయము?

❖ ❖ ❖

you cheat!

break up అవడం కొత్త కాదన్నావు కదరా?
ఏడుపెందుకు మరి? ఎవత్తో కానిదాని కోసం.

ఎప్పుడూ ఇలాగే నవ్వుతూ ఉంటానని
మాటిచ్చావా తనకి? ఇకిలించుకుంటూ..

తల్చుకుని తల్చుకుని తలనొప్పొస్తుంది.
ముందా ఏడుపాపి
ఇప్పుడన్నా పుస్తకంతెరువ్!

ఎవరైతేనేం

ఆమె ఎవరైతేనేం!
బతికే బతుకు
వెతికే చోటు మారదు.
అలిసే దేహం
అలిగే హృదయం మారదు.

ఆమె ఎవరైతేనేం!
ఆశగా చూస్తూ
మసకనటించడం మారదు.
కొంటెగా నవ్వుతూ
కోరికలేదనడం మారదు.

ఊపిరైతే ఉంటుంది.
ప్రకృతిని శ్వాసించడానికి–
ఊసులైతే ఉంటాయ్.
ప్రకృతిలో సేదతీరడానికి–
నిశ్వాసించే వేగం మారదు.
నిశ్శబ్దించే ధర్మం మారదు.

ప్రాణమైతే ఉంటుంది.
ప్రకృతిని ప్రేమించడానికి–
ప్రశ్నలైతే ఉంటాయ్.
ప్రకృతిని వెలివేయడానికి–
వొడిసిపట్టే వేగం మారదు.
వదిలివేసే ధర్మం మారదు.

ఆమె ఎవరైతేనేం!
బతికే బతుకు
వెతికేచోటు మారదు.
అలిసే దేహం
అలిగే హృదయం మారదు.

నువ్వు
వేల అక్షరాల్ని పోగుచేసుకొనిరా!
ఆమె చదువుకునే పద్దతే మారదు.
వేవేల గానాల్ని గుండెనింపుకురా!
ఆమె విసిరివేసే సమయమూ మారదు.

వేల అద్దాల్ని చూపుతో హద్దుకో!
ఆమె ప్రతిబింబించే పద్దతే మారదు.
వేవేల దృశ్యాల్ని స్పర్శల్లో చిత్రించుకో!
ఆమె ప్రతిస్పర్శించే సమయమూ మారదు.

ఆమె ఎవరైతేనేం!
ఆశగా చూస్తూ
మసకనటించడం మారదు.
కొంటెగా నవ్వుతూ
కోరికలేదనటం మారదు.

అతడొకడే

1
ఒంటరి మేఘం ఒకటి
దుఃఖమై వర్షిస్తే..

అందరూ ఇష్టంగా తడిసిపోయారు.
అందరూ దీనంగా తలుపుతీసారు.

2
ఒంటరి దేహం ఒకటి
లీలగా స్పర్శిస్తే..

అందరూ దూరంగా జరిగిపోయారు.
అందరూ ఒకసారే తలుపులేసారు.

3
భుజానికి ఎత్తుకున్నా
గొయ్యితీసి పాతకున్నా

4
మరణించిన అతడొకడే
చితినిపేర్చాడు.

మరణించిన అతడొకడే
కాలిపోయాడు.

5
అక్షరాల్లో
స్వర్గం తగలబడింది.

అక్షరం
అతనిలో బూడిదయింది.

నిశ్శబ్దం

1
గాలి మాట్లాడదు.

చల్లటి ఒకరాగం తీసి, అటూఇటూ లాలిస్తూ ఊపి
పువ్వులు విచ్చుకున్నంత సుకుమారంగానే నిదురపోతానని
ఊహిస్తుంది.
పాటపూర్తవదు.
మూడోచరణం చివరి అంచులో రాగం గతితప్పి
ఆగిపోతుంది.

2
తుంపర?

తుంపర మాట్లాడదు. చల్లగా ఒకసారి హత్తుకొని, ఇంకా
గట్టిగా హత్తుకుని, తలమీద నీ వేళ్ళస్పర్శతో కదిలి,
చిగురేసిన
మృత్యువుపై నీళ్ళుజల్లుతుంది.

గువ్వలు ముడుచుకున్నంత ఒద్దికగా గూటిని సర్దిపెట్టి
ఆనందపడ్తుంది. ఆపై

3

వాన?

వాన మాట్లాడాలని ప్రయత్నించీ ప్రయత్నించీ
ఒక్కతే ఒంటరిగా వెలిసిపోతుంది.
ఆకాశంలాగే ఉదయాస్తమయాలనిండా
దయని వర్షిస్తూ అలిసిపోతుంది.

ఇక ఇద్దరం రాత్రిలోకి వెళ్ళిపోయాక, శ్వాసలోకి ఇద్దరం
పారిపోయాక–పువ్వులూ, గువ్వలూ, ఆకాశాలన్నీ
ఒకేసారి ఇద్దరినీ అల్లుకుపోతాయ్. ఒకేసారి ఇద్దరికీ
ప్రాణంపోస్తాయ్.

నేను మాట్లాడను. ఇంతే. ఇక మాట్లాడను. ఇంకెప్పటికీ
మాట్లాడలేను.

గోస

నా చుట్టూ అల్లుకున్న పూలతీగ లేదు.
ఇనుప గొలుసుల్తో నన్ను బంధించారు.
నా మీద వాలే సీతాకోకలు రావు.
అడవినంతా ఎవరో మాయజేసారు.

నాతో కలిసి పాడే పిచుకలూ, పిట్టలూ
పొరుగుదేశంలోకి వలసపోయాయి.
గొంతు తడిపే వాగు, కడుపు నింపే చేను
మట్టిలో మట్టిగా కలిసిపోయాయి.

నా ఇంట్లోకి నేను చొచ్చుకువచ్చేలోపే
జరగాల్సిన దారుణం జరిగిపోయింది.
నష్ట పరిహారం కింద దయాశీలొకడు
గుడిసెకి గుండెకి లెక్కకట్టాడు.

ఓపెన్ కాస్టులో నా ఊరొక బర్వే
నన్నెవరైనా దర్వీష్ చేస్తారా?
ప్రభుత్వ యూదుల్తో నాదో పాలస్తీనా
నాకెవరైనా ఆశ్రయమిస్తారా?

ముసురు

ఇల్లెగిరిపోతుంటే
కమ్మలెన్కబడి ఉర్కిన–
ఈదురుగాలికి పుట్టిన సంబరమంతా
దెంకపాయె.

నీళ్ళింట్లకొస్తే
గిన్నెల్తోటి ఎత్తిపారబోశిన–
చినుకుల్జేసిన గావురానికి
యాష్టకొచ్చె.

ఇగ ముసుర్లు పడ్తుంటే సూడాలె..
నీయవ్వ!
నిలుసున్నా పండుకున్నా
ఉరుస్తుంటే తడుసుడేనాయె..

❖❖❖

మా అయ్య ఒడ్లు తవ్వపోతడు.
అవ్! లేదంటే మళ్ళ కలుపప్పుడు
గడ్డి పీక్కుంటసావాలె.

మా అవ్వేమో పొయ్యిని
పొడిజేస్తాంటది.
మరి-ఉత్తగ నిలుసోవాల్నన్నా
ఇంత గంజి తాగాల్నాయె..

తడిసిన పిశ్కలూ, తమ్ముడూ
ఇనబడకుండా ఒకటే కిచకిచ-
యిటి సప్పుడేందో
ఇళ్ళుకప్పుతాంటే మధ్యల..

ఇసుర్రాయి సందులోన
ఇకిలించుకుంటు వానకోయిల-
వసంతమో పాడో
ఏమో ఎవనికెర్క..

❖ ❖ ❖

వాసాలల్ల ఎల్కలు
ఎక్కడ దాక్కుంటయో తెల్వది.
పాములు ఇంటిసుట్టే తిర్గుతుంటయ్.

సర్కరోడి లెక్కలు
సదువుతనో లేదో
మోరంచకి బళ్ళు బందైపోతయ్.

బర్లకీ ఎడ్లకీ తడిశినా ఏంగాదు.
సలి, వనుకు మాకె..
మనుషులకె..

యేడాదో, జీవితమో
ఏమైన పర్వాతై
గూనలో, రేకులో..
సంపయించాలె ఎట్లనన్న..

❖❖❖

బియ్యంసంచికాంచి అన్ని తడిశిపాయె–
కాగితాల్జింపి
పడవలెట్లెయాలె?

ఉరుమురుముకి పెళ్ళరాలనెబట్టె–
రేగడిమన్నుదెచ్చి
గోడెప్పుడుపూయాలె?

రాఖీ

హసన్‌పర్తి హాస్టల్లోంచి
పండక్కని పర్మిషనడిగి
జీపుల్లల్ల ఆటోల్లల్లబడి
ఇంటిముందుదాంక వచ్చి

నేనొచ్చి లోపలికి తీస్కపోవాలని
కడపకాన్నే కూలబడ్డట్టు..
నీ కండ్లపొంట నీళ్ళు
బొటబొటా రాలుతున్నట్టు..

బట్టలుతుక్కొని ఎర్రగైన
నీ లేతచేతుల్లల్ల కట్టెలసంచితో
నువ్వింకా అక్కన్నే
నిలుసున్నట్టు..

గనపడంగనే
ఉరుక్కుంట వచ్చి
కావలించుకుని
కండ్లు తుడుసుకున్నట్టు..

తెచ్చిన దారప్పోసల రాఖీకి
నీలెక్క నాలెక్క గుచ్చిపెట్టిన
రెండుపూసలూ..
మాయమయినట్టూ
మళ్ళీ తేలినట్టూ..

ఏందోనే అక్కా!
రాత్రంతా ఒకటే మనాది!

❖❖❖

రెండేండ్లు నువు రాలేనపుడు
చెల్లెనే రెండ్రెండుగట్టింది.
నువ్వు చెయ్యిపట్టుకునే తీరు
గదెప్పుడు నేర్శిందో తెల్వలే..

నాలుగేండ్లు నేను రానప్పుడైన
ఎట్లబడి నీ రాఖీ నాకుజేరేది.
పోస్టుల్నైనా పంపించి
కట్టుకొమ్మని ఫోన్‌జేసేదానివి..

❖❖❖

సాగతోల్తాంటే
అమ్మ నాచేతిల
నీచెయ్యిపెట్టినప్పుడో
నల్లపూసలు గుచ్చినంక
కార్ల నిన్ను తీస్కపోయేటప్పుడో
నిమిషమన్నా
దుక్కించకపోతిని!

అందర్ని సూడబుద్దయితుందిరా అని
మొన్న మాట్లాడినపుడన్న
ఏడ్వకపోతిని!

నువ్వు మళ్ళా
పర్మిషనడిగి
కట్టెలసంచితో
ఇంటికాడ నాకోసం
ఎదురుసూస్తున్నట్టూ..

వెండిరాఖీ
రెండు దారప్పోసల మధ్య
ఇరుక్కున్నట్టూ..

ఏందోనే అక్కా!
పొద్దున్నే పిచ్చి కల!

❖❖❖

ఏదేమైనా
నీకోటిజెప్పాల్నే..

గీ దినమన్నా
నీ యాదిల గడపకుంటే
యాడాదంత
గడ్వనట్టే ఉంటది.

అక్కా! నీ బాంచన్..
యేడున్న సల్లగుండు..

అకాలవర్షం

ఆరిపోయే ఆశకి చేతుల్ని అడ్డుపెట్టి
మెరుస్తున్న ఆకాశాన్ని అదేపనిగా చూస్తూ
సయించని అన్నాన్ని పిడికిట్లో దాచి
దిగుట్లో దాగని, దీపాన్ని యెలిగిస్తూ

గుండె తలుపుల్ని ఇంటి కిటికీల్ని మూసి
ఉరుముతున్న మేఘాల్ని నోరారా తిట్టుకుంటూ
పురిటినొప్పుల బిడ్డనూ, పుట్టబోయే పిల్లల్నీ
కాపుకాయమంటూ, కాల్మొక్తనంటూ

రాతిరి మొక్కిన మొక్కులన్నీ
పొద్దుటికల్లా తీరిపోయాయ్.
రాజేసుని దయలేకేమో
చేన్లో గింజలు రాలిపోయాయ్.

నిన్నటిదాక చెమటతో తడిసిన నేల
రాత్రికి రాత్రే ఎండిపోయింది.
పొద్దుదాంకా నవ్వుతూ ఊగిన చేను
రాత్రికి రాత్రే సచ్చిపోయింది.

ఈ పొద్దు అతనికి మిగిల్చిందేం లేదు..
తడిసిన గడ్డి, ఆరిన కండ్లూ తప్ప!

కాంక్ష

వసంతమొస్తుందనో, మల్లెలు పూస్తాయనో
ధిక్కార స్వరమొకటి గానం చేస్తుందనో
పిరమిడ్లోని ఆత్మ ఆవహిస్తుందనో
చమురు దీపం నేనై తగలబడుతాననో

ఎప్పుడు ఓ కలలో బతుకుతుంటాను.
ప్రతిరోజు పత్రికలో మునుగుతుంటాను.
పెదాలు కదపాలని అనుకుంటూనే
దశాబ్దాలు గొంతులో గడుపుకుంటాను

స్వతంత్రం రాలేదనో, రాజ్యాంగం సరిపోదనో
నాయకుడు ఒకడైన పుట్టుకొస్తాడనో
ఆకాశంలో చుక్క రాలిపడుతుందనో
రాగానే చీకట్లు సమసిపోతాయనో

ఏదేదో పిచ్చిగా కలవరిస్తాను.
ఎన్నికల సాక్షిగా నిదురలేస్తాను.
చరిత్ర చూడని వర్తమానంలోకి
దేశాన్నీ నన్ను తీసుకెళతాను.

ఇక అప్పుడో ఇప్పుడో ఎప్పుడో ఒకసారి
మొదలేదో,తుదిఏదో అసలెరగని ఆశతో
అప్పుడో ఇప్పుడో ఎప్పుడో ఒకసారి
ఎందుకో ఏమిటో పోల్చలేని చూపుతో

పాక్‌లో, ఆఫ్ఘన్‌లో పర్యటిస్తాను.
పేలేటి మనుషుల్ని పలకరిస్తాను.
టిబెట్‌కి, నేపాల్‌కి వలసపోతాను.
అధికారమెవరిదో అడిగిచూస్తాను.

గాజాలో, సిరియాలో తిరిగివస్తాను.
శవాల్ని, మనుషుల్ని లెక్కవేస్తాను.
మధ్యప్రాచ్యంపైన కలియబడతాను.
కుర్దుల్ని గుట్టుగా హత్తుకుంటాను.

తహ్రీర్ స్క్వేర్లోంచి ఎగసే నినాదాలు
ఊరిపొలిమేరలు దాటి వినిపిస్తుంటాయ్.
అసబియ అంటే అర్థం వెతుకుతుంటే
పిడికిట్లో నరాలు తెగినట్టుగా ఉంటుంది.

నియంతని నిర్వచిస్తూనో, నిరీక్షిస్తూనో
ఈ రోజూకూడా గడిచిపోతుంది.
నిజాయితీగా ఒక్క అడుగన్న వేయమని
కాలికింది మన్ను వేడుకుంటుంది.

నన్ను నేను విడిపించుకోకముందే
సూకీని ఎవరో కట్టిపడేస్తారు.
నన్ను నేను అర్థంచేసుకునేలోపు
సద్దాంని ఎక్కడో ఉరి తీస్తారు.

నన్ను నేను నిలబెట్టుకుంటుంటే
గధాఫీని గుట్టుగా పేల్చేస్తారు.
నన్ను నేను నిలదీసుకోకముందే
వాల్ స్ట్రీట్ని ఎవరో ఆక్రమిస్తారు.

అభివృద్ధిని కాంక్షించే నేను
ఆలోచిస్తూనే కాలం గడిపేస్తాను!

పునర్నిమర్శ

1

గద్దలు ఆకాశం తమదంటూ
చక్కర్లు కొడ్తాయ్.
పాములు పుట్టల్లోంచి, గుట్టల్లోంచి
పైకి పాకుతాయ్.

నిజాయితీ లేని ఆసరా ఏదో
మినుక్కుమనే గాలిలో మెరుస్తుంటుంది.
సంజాయిషీ కోరని అభిమానమంతా
చురుక్కుమనే నీడలో తడుస్తుంటుంది.

శిశిరాన్ని గెలిచిన పిచ్చిలో వెర్రిలో
చెట్టుకి ఏమీ పట్టకపోవచ్చు.
వసంతం చూడని కోయిలల గొంతులో
రాగం ఏదీ పుట్టకపోవచ్చు.

వాలే పక్షులకి ఏ చెట్టైనా ఒక్కటే
గూడు కడ్తే గుండె పగిలిపోతుంది.
గాలివానొకటి గట్టిగా వీస్తే
నిజం నిక్కచ్చిగా తెలిసిపోతుంది.

ఏదైతేనేం? ఋతువొకటి మారింది.
ప్రకృతికీ, నీకూ పనికొస్తుంది.
ఎలాగైతేనేం? ఋజువేదో దొరికింది.
వాగుకో, వలసకో పొమ్మంటోంది.

విషాదాన్ని మింగి మూగబోయిన నీకు
పగిలిన కన్నుల్తో ప్రాణంపోయిన నీకు
మరో అకాలాన్ని కలవలేని నీకు
మరో ప్రపంచాన్ని చూడలేని నీకు

సాయం సాయంత్రమై కరిగేపూట
ఎందుకొచ్చిన వేదాంతం బుల్‌బుల్?
నిజం.. నీకెవరూ లేరు!
నీ రెక్క నువ్వే కట్టుకోవాలె.
నీలాగె నువ్వు ఎగిరిపోవాలె.

ఏం జరిగిందో, ఏం మారిందో ఆలోచిస్తూ
ఎటెల్లావో, ఎలా చిక్కుబడ్డావో పరిశోధిస్తూ
ఏందాచావో, ఏం కోల్పోయావో లెక్కలు వేస్తూ
ఎక్కడికిపోవాలో, ఎలా తెంపుకోవాలో పత్రంరాస్తూ

కాలం నిర్దయగా వెక్కిరించే వేళ
ఎవరిచ్చిన ఏకాంతం బుల్‌బుల్?
నిజం.. నీకెవరూ లేరు!
నీ గింజ నువ్వే సంపాయించాలె.
నీ బతుకు నువ్వే బతికిసూపాలె.

2

కొన్ని పరిచయాలంతే!
ఊహలో కూడా తెలియని రెక్కల్ని కట్టి
రివ్వున వీచేగాలిలో
ఒక్కసారిగా ఎగరేస్తాయ్..

తేరుకుని కిందపడ్డావో
సరేసరి!
దేహం విరిగినా
ప్రాణం మిగిలించుకోవచ్చు.

సరదాగానో, సంతోషంగానో
కదలడం మొదలెట్టావో–
ఇక అంతే!
నీ ప్రయాణం, ప్రయాస
రెండూ మొదలవుతాయి.

ఆకాశం ఎప్పటికీ అందదు.
నేలమీదే జీవితం సాగదు.
గాలొచ్చినా, వానొచ్చినా భయపడాలి.
గద్దొచ్చినా, పామొచ్చినా దాక్కోవాలి.

కొమ్మపైన గూడు కడ్తే చెట్టుకి
యేటిలో నీళ్ళు తాగితే కొండకి
గింజలు ఏరుకుంటే చేనుకి
ఈకలు రాల్చుకుంటే గాలికి
సమాధానం చెప్పితీరాలి.

ఎగరడం తప్ప ఏమీతెలీదన్నా
ఎగరడం నీ తప్పనిసరి అవసరమైనా
ఎగరకపోతే బతుకే లేదని తెలిసినా
సమాధానం చెప్పితీరాలి.

పూవులభాషలో మాట్లాడడం
గువ్వలభాషలో పాడడం
పిల్లలభాషలో పదాలల్లడం కాదు.
మనషులభాషలో నటించడం నేర్చుకోవాలి.

ఎందుకూ పనికిరాని స్వేచ్ఛతో
ఎటో ఓ దిక్కుకి ఏడ్చుకుంటూ ఎగిరిపోతూ
చెట్టుకి, చేనుకి, యేటికి, గాలికి
వీలైనా కాకున్నా వేగులకి, వేటగాళ్ళకీ
సమాధానం చెప్పితీరాలి.

సమాధానం చెప్పేతీరాలి.

3

కొన్ని స్నేహాలూ అంతే!

రెక్కలొచ్చాయని తెలిసేలోపే
ఆకాశాలవైపు ఎగరేసుకుపోతాయ్.
గూడు కట్టాలని గుర్తొచ్చేలోపు
కనపడని గుర్తేదో ముద్రించిపోతాయ్.

ఎందుకో అడగొద్దంటూ
కొండకోనలు, వాగువంకలు తిప్పుకొస్తాయ్.
ఏ పనీ లేనందుకు
మౌనంగా వెళ్ళిపోవాలి.

ఎవరికీ చెప్పొదంటూ
రెక్కలెలా విప్పుకోవాలో, పూలనెలా గుర్తుపట్టాలో
నేర్పిస్తాయ్.
ఏ తెలివీ లేనందుకు
సడిచేయకుండా అనుసరించాలి.

పచ్చని చెట్ల రంగుని, దూరపు కొండల ఎత్తుని,
పూసేపూల అందాన్నీ, అవి చెప్తేనే తెలుసుకోవాలి.
వాలుగా కురిసేది వాననీ, వాగులో పారేది నీరనీ,
వచ్చిపోయేది గాలనీ, అవి నేర్పగా నేర్చుకోవాలి.

చెట్టుకాస్తే పండ్లు పైనే ఉండాలని
చేను పండితే గింజలు కిందే రాలాలనీ కోరుకోవాలి.
ఆకురాలేముందు వసంతాలకి
పూతరాలేముందు పూర్వాహ్నాలకీ వలస పోవాలి.

పొద్దుటి పూట వెలుగనీ, సాయంకాలం చీకటనీ
ఎండపూట తిరగొద్దనీ, ఎన్నెలపూట పాడొద్దనీ
నీరు తాగాలనీ, గాలి పీల్చాలనీ
వువ్వులురాలినట్టు ప్రాణం రాల్చాలనీ

దేవుడా!
ఆ ఉపదేశాలకి అడ్డూ, అదుపూ ఉండదు.
ఆ నేర్పు ఎన్నటికీ చదవాలనిపించదు.

చివరగా –వచ్చే అజ్ఞానమేమంటే
వయసుతో అనుభవం రాదనీ
అనుభవిస్తే బతుకు సరిపోదనీ
నీ బతుకు నువ్వే బతకాలనీ..
నీలాగే నువ్వు చావాలనీ..

ఇంకా బతికే వున్నవా?
ఉంటే ఏమంటావు బుల్‌బుల్?!

4

మరి ప్రేమ సంగతో బుల్‌బుల్
అదెందుకు దాస్తావ్?

పక్షిలా పాడగలిగినందుకు
పాడుతూ అరవగలిగినందుకు
ప్రేమించబడతావ్.

పువ్వుల్ని ఊహించినందుకు
వెన్నెల్ని మోహించినందుకు
ప్రేమించబడతావ్.

పొద్దుటి అడవిపిట్ట మొదలు
రాత్రి పెదపిట్టదాకా
నువ్వు ప్రేమించబడని
క్షణమంటూ ఉండదు.

మాపటి కొంగలు మొదలు
చీకటి చకోరం వరకు
మాట్లాడుకోని
సమయాలూ ఉండవు.

ఎందుకని ఎప్పుడూ అడగవు.
చెప్పేంత పిచ్చితనం దానికీ ఉండదు.
కొన్ని రోజులు బాగానే గడుస్తాయ్
భారంగా మరికొన్ని

ఎటెల్లేదీ ఎందుకనేదీ
ఆలోచించని మత్తులో
పూలగాలికి తేలిపోతూ
ఇంకొన్ని..

❖❖❖

అప్పటివరకూ అంతామంచే–
అనుకోకుండా ఏదో చిక్కొచ్చి పడుతుంది.
ఋతువెలా మారేదీ తెలీదు.

ఎన్నోరోజుల ఏకాంతాన్ని
కాలరాసిన నీకు
శిక్షపడే కాలమొకటి రానే వస్తుంది

వసంతపు కోయిల, వర్షపు చక్రవాకం
నీ గుండెల మీదుగా ఎగిరెళ్ళిపోతాయ్.
వగపు కోరికలు, వయసు నెమళ్ళు
దేహం నిండా పురివిప్పుతాయ్.

పూలగాలికి తేలిపోయిన నువ్వు
ఒక్కసారిగా నేలకూలుతావ్.
వెన్నెల సిద్ధాంతాలు రాసిపోసిన నువ్వు
చీకటి చివరంచుకు విసిరేయబడతావ్.

పొద్దుతిరుగుళ్ళ ప్రేమ
ఇదంతా పట్టనట్టే కనిపిస్తుంది.
కానీ, కాలానుగుణంగా చలించడం
దానికీ తప్పదని తెలుసు నీకు.

❖❖❖

తరువాతేమవుతుందో తెలుసుగా?

పక్కనే ఉండలేనందుకు
గూటిలో జాగలేనందుకు
ద్వేషించబడతావ్.

పువ్వుల్ని తెంపనందుకు
వెన్నెల్ని తాకనందుకు
ద్వేషించబడతావ్.

ఉన్నొక్క యవ్వనం తీరక ముందే
తేలిగ్గా నీ కథ
చివరి మలుపు తిరుగుతుంది.

రెక్క పొడుగనో, ముక్కు పదుననో
కాళ్ళు కదల్లేదనో, గోర్లు పెరగలేదనో
కారణాలేమైతేనేం!

నువ్వు ద్వేషించబడతావ్.
నిర్ధయగా వెలివేయబడతావ్.
కథ ముగిసిపోతుంది.

❖ ❖ ❖

బుల్‌బుల్ ఆగిపోకు.
విను.
కథలో చివరి సందేశాలు
విచిత్రంగా ఉంటాయ్.

మూడుకాలాల్నీ విరిచి
మూడు చావులకీ ముద్దుపెట్టి
మూడుముళ్ళూ వద్దని
ముసుగేసి పడుకున్న నిన్ను

పాలపిట్ట రంగనీ
జిట్టంగి చూపనీ
వడ్రంగి పట్టనీ నిద్రలేపిన తను–

పగల్నీ,రాత్రినీ
వెన్నెల్నీ, చీకటినీ
నిర్లిప్తంగా, నిశ్శేషంగా
నిర్ధారించీ, విభాగించీ

వెన్నెల రహస్యం వెన్నెలకీ
చీకటి రహస్యం చీకటికీ
నిశ్శబ్ధంగా నిజాయితీగా
నిష్కామంగా పంచమంటుంది.

ఇంకా

నీరెండకి దాగిపోవడం పిరికితనమని
నిప్పులగాలికి ఎదురుపోవడం మగతనమనీ

చిరుజల్లుతో సర్ధుకుంటే పాపమని
జడివానకు తడిసిపోవడం మోక్షమని
చలిగాలికి వణికిపోతే ఓటమని
చచ్చైనా గడ్డకట్టడం గెలుపని
నేర్చుకొమ్మంటుంది.

ఇంకా ఇంకా

ఏం కావాలి నీకు?
గూడుకట్టే తెలివిలేక
పదేపదే
ఎగిరిపోయే నీకు..
మోసపోయే నీ బతుక్కి..

అనుభవించు!

5

దాహం మిగుల్తుంది ఎప్పటిలాగే–

ప్రేమ ఒలికిపోయాక
అంచనా తీరిపోయాక
ఎందుకో

నిండుగా పగిలిన గాజుపాత్రలో
నీ ముఖం ఎందుకో ప్రతిబింబించదు.
రాళ్ళువేసుకుంటూ నీళ్ళుతాగిన కాకి
నీకంటే కాస్త తెలివైందేమో!

బాధ మిగుల్తుంది ఎప్పటిలాగే–

స్నేహం వాడిపోయాక
తపన దారితప్పాక
ఎందుకో

నిండుగా పూసిన రంగుపువ్వుల్లో
నీ తడి ఎందుకో ప్రదర్శింపబడదు.

పుప్పొడి దోచి పారిపోయె తూనిగ
నీకంటే కాస్తచురుకైందేమో!

❖❖❖

ఆకాశాలు నేలకు దిగుతాయ్..
అప్పుడప్పుడు–
వెన్నెలకు దిక్కుండదు.
చుక్కలు గొంతులోచేరి ధారగా వెలుగుతుంటాయ్.

మాటలనిండా చీకటి
తెరలు తెరలుగా ఉదయిస్తుంటుంది.

అనంతం పహారాకాస్తుంది.
తెలిసి తెలిసీ
నీతులనెవ్వడు కాపాడలేడు
శూన్యం ఎగురుతూవచ్చి ఒళ్ళంతాపాకి ఉక్కిరిచేస్తుంది.

స్పర్శనిండా జ్ఞానం
పొరలు పొరలుగా అస్తమిస్తుంది.

❖❖❖

బుల్‌బుల్!

నువ్వూ మిగుల్తావ్ ఎప్పటిలాగే–
పదాలు పేర్చుకుంటూ
అక్షరం దాచుకుంటూ
ఎందుకో

చెదిరిన ఊహల్లో
ఎందుకో
నీ మునుపటి కలకి ఆనవాలు దొరకదు

నువ్వూ వెతుకుతావ్ ఎప్పటిలాగే–
గుండెపై మరకలు తుడిచి
చూపులో మసకని విడిచి
ఎందుకో

తెలియని దారుల్లో
ఎందుకో
నీ వెలుపలి మనిషిని గమ్యం తాకదు.

1

ఊగుతావ్ అటూ ఇటూ..
కొంచెం గాలి, కొంచెం ప్రేమా వీస్తాయ్.
ఇంకొంచెం కాంతి–
.. నీ చిర్నవ్వు సాక్షిగా
కొంచెం సంతోషం కూడా!

ఉరుకుతావ్ అటూ ఇటూ..
కొంచెం ధూళి, కొంచెం అలక రాల్తాయ్.
ఇంకొంచెం చీకటి –
.. నీ అడుగుల ఆనవాళ్ళుగా
కొన్ని కన్నీళ్ళు కూడా!

ఎటునుండి మొదలవుతామో ఇద్దరం..
ముందునుండి వెనక్కో వెనక నుండి ముందుకో
గుర్తు తెలీదు.

ఎక్కడికి చేరిపోతామో ఇద్దరం..
తిరిగి తిరిగి మొదట్లోనో, తిరగకుండా చివర్లోనో
అర్ధం కాదు.

ఎర్రటి పొద్దుకి, ఎండపొడకి ఎంత ఆనందమో..
ఆకాశంపై తన్నడిచేకొద్దీ
చీకటి పువ్వులై పూస్తూనే ఉంటుంది.

మాపటి పొద్దుకి, మర్లే గువ్వకి భయం లేదు..
ఆకాశం అట్లానే ఉంటుందని, ఎక్కడికిపోలేదని
నమ్మికదుల్తాయ్.

మరి–ఎట్లా చెప్పను బాధంటే ఏంటో?
ఆపై నిన్ను నిన్నుగా ప్రేమించలేను!
ఎందుకో..

2

ఎందుకో!

అవును–
ఎందుకో తెలీదంటాగాని
నిజానికి తెలుసు.

నిజమో, అబద్దమో–
రెండిటికి అందనిదో
నీకో, నాకో–
ఇద్దరికి చెందనిదో
మొత్తానికైతే తెలుసు.
మొదలే చివరని తెలుసు.

చెప్పనా?
నువ్వూ నాలాగే దొరికావ్
పసితనం అలల మీద
లేలేత గవ్వలా తేలుతూ వచ్చావ్.
సముద్రాన్ని, నీలాన్ని వెంటతెచ్చుకున్నావ్.

నువ్వూ నాలాగే నవ్వావ్.
పసిగువ్వ రెక్కల మీద
సరికొత్త రంగుపై తేలుతూ వచ్చావ్.
ఆకాశాన్నీ, ఎరుపుని చెక్కిట దాచుకున్నావ్.

తెలుసా?
నువ్వు నాలాగే నడిచావ్.
పసిపూల సువాసనల్లో
లేలేత కాంతుల్ని చల్లుతూ వచ్చావ్.
మట్టిలో పచ్చగా నాటుకొమ్మన్నావ్.

ఇంకా–
నువ్వు నాలాగే మిగిలావ్.
పసితనపు మృదుభాషల్లో
ప్రాణాన్నే ప్రణవంగా చల్లుతూ వచ్చావ్.
మట్టిలో మట్టిగా కలిసిపొమ్మన్నావ్.

ఇప్పుడు నా నల్లటి గుండెలపై
నీ ముద్దొక తెల్లటి పువ్వు.
రంగులైదే ఉన్నా
నీ కౌగిట్లో ఒక హరివిల్లు.

మరి–చెప్పు నువ్వే..
మళ్ళీ మునుపటిలా
ప్రేమిస్తానా?

నా ప్రాణాన్ని..

3

‘ప్రాణమా?
ఏం భాష నీది?
కాబూలీవాలా నువ్వేనా?
నా పెళ్ళికేమన్నా వచ్చావా?’

ఏమో!
నువ్వడగలేదుగాని
చిట్టితల్లీ!
ప్రశ్నలు గుచ్చుకుంటున్నాయ్.
ఎందుకైనా మంచిది.
ఓ కథ చెప్తా విను.

నీలాగే ఒకడుండేవాడు..
అసురసంధ్యల మీద అమృతం కురిపించి
చిక్కటి చీకట్లోంచి, పచ్చటి పొలాల్లోంచి
చింతచెట్ల మలుపుల్లోంచి, చిమ్మట్ల అరుపుల్లోంచి
చిగురంతైనా భయంలేకుండా
చేతిలో చిన్న లాంతరొకటి పట్టుకుని
అడుగుల్లో అడుగేస్తూ, అడవిపిట్టలా కూతవేస్తూ
మెల్లగా మెల్లగా చీమలాగా కదిలేవాడు.

నీలాగే ఒకడుండేవాడు..
జంతువులకి, మనుషులకి తేడా తెలీనంత
కష్టానికి, కన్నీళ్ళకి అర్థం తెలీనంత
కవితలకి, కావ్యాలకి అసలే అందనంత
కథల్లో పాటల్లో చెప్పడం వీళ్ళేనంత
అమాయకంగా తిరుగుతూ, ఆర్ద్రంగా కదుల్తూ
పుప్పొడిని చీమకు, తేనెను సీతాకోకకు
సమంగా పంచమని దేవున్ని కోరేవాడు.

వాడు నీలాగే–
అచ్చం నీలాగే నవ్వుతూ, తుళ్ళుతూ
అచ్చం నీలాగే ఉరుకుతూ, ఉరుముతూ
వెన్నెల కురిస్తే తడిసి, ఎండ పొడిస్తే ఏడ్చి
పొద్దు నెత్తికెక్కుతుంటే గారాలు దులుపుకుంటూ
చేతిలో సంచితో, సంచిలో సద్దితో
సద్దిలో బువ్వతో, బువ్వలో అమ్మతో
పొద్దుగూకేదాక బళ్ళోనే దాగిపోయి
సాయంసంధ్యపైన సూరీడై వెలిగేవాడు.

నీలాంటి కన్నుల్తోనే ప్రపంచాన్ని
నీలాంటి పెదాల్తోనే ప్రవాహాల్ని
నీలాంటి స్పర్శల్తోనే ప్రమాదాల్ని
గెలిచి చూపేవాడు.

నీలాంటి చూపుతోనే మనుషుల్ని
నీలాంటి మాటతోటి మనసుల్ని
నీలాంటి కదలికల్తో మహిమల్ని
సంపాదించేవాడు.

ఇప్పుడు వాడ్లేడు!

ఎండిన యేరులో ఈదలేక
తడవని పడవల్ని నడపలేక
ఎగరని గువ్వల్ని కదపలేక
ఏరిన గింజల్ని విసరలేక
ఎవరికీ చెప్పకుండా
ఎవర్నీ అడగకుండా
ఎక్కడో గుట్టుగా
ఉరివేసుకు చనిపోయాడు.

చిట్టితల్లీ!
అదెవరో తెలుసా?
అది నేనే...

4

నేనేనా?
అవున్నేనే...
ఎందుకు చంపుకున్నాను?
ఒక్కో మెట్టు ఎక్కుతూ
ఒక్కసారి జారిపడ్డందుకా?
అయ్యుండదు.
నువు గంతేసే తీరు చూస్తే
నమ్మాలనిపించదు.

ఒక్కో ఇటుక పేరిస్తే
ఒక్కసారే కూలిపోయినందుకా?
అయ్యుండదు.
నువు కట్టే ఇసుకగూళ్ళు
అబద్ధమాడవు.

పోనీ – ఒక్కో రంగు అద్దితే
ఒక్కసారిగా తడిసిపోయినందుకా?
లేదు.. అదీ కాదు.
నీ రంగురంగుల చిర్నవ్వు
సాక్ష్యమడిగితే తీస్కురాలేను.

బహుశా
ఒక్కసారిగా ఏది జరగలేదు!

ఒక్కొక్క రోజుకి కొద్దికొద్దిగా
ఒక్కో యేడాదికి మరింత వేగంగా
ఒక్కొక్క మనిషితో కొద్దికొద్దిగా
ఒక్కో సమూహంతో మరింత వేగంగా
ఏదో జరిగింది, నిజం.. కానీ
ఒక్కసారిగా ఏది జరగలేదు!

ఊయల్లో అటూ, ఇటూ ఊగి
ఊపిరిని అటో, ఇటో కదిపి
ఉరుకుతూ అటూ, ఇటూ నడిచి
ఉరుముతూ అటో, ఇటో చూసి

వచ్చీ పోయే పరిశీలనతో
వస్తే పోలేని అజ్ఞానంతో
ఎర్రటి పొద్దుకి యేడు
మాపటిపొద్దుకి పదిహేడు
గడచిపోయాయ్.

బహుశా
ఒక్కసారిగా ఎవ్వరు మారిపోరు!

యవ్వనాన్ని దోసిళ్ళతో తాగలేక
ఎదిగే కల్మషాన్ని ఓపలేక
అనుభవం జీవితం కాని
నాలాంటి వాళ్ళు కొందరు మాత్రమే

ఎవరికీ చెప్పకుండా, ఎవర్నీ అడగకుండా
ఎందుకో తెలీకుండా ఉరివేసుకుంటారు.

ఓ కొత్తరోజు కోసం
నిమిషాల్ని పొదువుకున్న
చివరి ఘడియల్లో..

చిట్టితల్లీ!
జీవితమ్మీద ఒట్టేసి
నీకో మాట చెప్పనా?

నువ్వొక ప్రాణం నిండిన ఆత్మవి.
నీలా ఉండటమే నాకు చాలా ఇష్టం.

5

అసలు
నీలాగా ఉండటమే కావాలి.
ఆచరణ ఆలోచన్ని బతకనీయదు.

అసలు
నీలాగా మిగలడమే కావాలి.
నిమిషాలని కాలమసలె నిలువనీయదు.

ఎలా పెరిగేదీ తెలీదు.
ఎందుకు ఎదిగేదీ తెలీదు.
చూపు, ఏడ్పు, నవ్వు, నడక
మాట, పాట, ఆట, అలక
నెమ్మదినెమ్మదిగానే అడుగులు వేస్తాయ్.
చూస్తూచూస్తుంటేనే దగ్గరికొస్తాయ్.

అమాయకత్వం ఏ కాస్తో మిగిలి ఉంటే
తెలివేదో వచ్చిందని సంబరపెడ్తాయ్.

అసలు
నీలాగే ఉంటాం అందరం.

గవ్వలాగ తేలుతూ ఇసుకలోన ఆడుతూ
గువ్వలాగ ఎగురుతూ గాలిపటం లాగుతూ
కాంతిలాగ పరుచుకొని ఊరంతా తిరుగుతూ
మట్టిమట్టి చేతుల్తో నీలాగే అందరం.
పువ్వులాగ విచ్చుకుంటు గాలినంత నింపుతూ
పున్నెమేదో పాపమేదో తెలీకుంట గడుపుతూ
అమ్మలాగ నాన్నలాగ చెయ్యి చెయ్యి కలుపుతూ
మురికి మురికి బట్టల్తో నీలాగే అందరం.

నువ్వు ముద్దుముద్దు మాటల్తో మురిపిస్తావా–
మా అమ్మలాగే కనిపిస్తావ్ నిజంగా!
నీకు చిన్న చిన్న విషయాలకు కోపమొస్తుందా–
మా నాన్నలాగే అనిపిస్తావ్ నిజంగా!

లేలేత స్పర్శవై, లేలేత కాంతివై
సరికొత్త రంగువై, ప్రాణంలో ప్రాణమై...

నీ చిన్నివేళ్ళతో నన్ను తట్టినప్పుడల్లా
ఒంటరిమేఘం ఒకటి దుఃఖమై వర్షిస్తుంది.
నీ చిర్నవ్వుతో నన్ను తాకినప్పుడల్లా
ఆకాశమే ఒంటరై దిగుల్తో చిన్నబోతుంది.

ఉంటాగుతావ్ అటూ ఇటూ..
కొంచెం గాలి, కొంచెం ప్రేమా వీస్తాయ్.
ఇంకొంచెం కాంతి–
.. నీ చిర్నవ్వు సాక్షిగా
కొంచెం సంతోషం కూడా!

ఉరుకుతావ్ అటూ ఇటూ..
కొంచెం ధూళి, కొంచెం అలక రాల్తాయ్.
ఇంకొంచెం చీకటి –
.. నీ అడుగుల ఆనవాళ్ళుగా
కొన్ని కన్నీళ్ళు కూడా!

ఒక సంధ్యావస్థకాలంలోంచి

1

దేవీ! ఎందుకో మొదలైందో జీవితం..

ఒక్కదేవుడితో కంటే లక్షల ప్రాణులతో కలిసి ఉండాలనే ప్రాణం కోరుకుందా? జన్మజన్మలుగా అదే జరుగుతుందా?

ఏమోలే! ఏదైతేనేం? అంతా ఏదో ఒకరోజు ఇట్లా అర్ధంతరంగా ముగిసిపోవాల్సిందే. ఒకరిలోన ఒకరమో, సృష్టిలోన అందరమో, విశ్వశూన్యంలోకో, శూన్యవిశ్వంలోకో..

నువ్వేదన్నా అనుకో– కొన్ని తీర్లు.. కొన్ని దార్లు..
ఆపై మళ్ళీ ఏడుస్తూ ఒక పుట్టుక.. మళ్ళీ మళ్ళీ ఒక
సంధ్యాకర్షణ.

అర్ధరహిత స్వార్థం ఏ అణువులో లేకున్నా, అంతరాలకి అర్ధం తెలిసినా తెలీకున్నా, విడిపోయి – కొన్ని అనర్థాలని తప్పించగలమన్న విశ్వాసం ఉన్నందుకూ, ఒక అంతిమ స్పర్శ ముందే రాసిపెట్టి ఉన్నందుకూ, ఏదో ఒకరోజు ఇలా...

అన్నీ అర్ధంతరంగా ముగించుకోవాల్సిందే.

❖❖❖

దేవీ! తామరపువ్వుల్ని బాధపెట్టకు.

నువ్వన్నట్లు అతీతంగానో, అద్భుతంగానో ఎన్నడూ లేను. ప్రయత్న పూర్వక దివ్యత్వమేదీ నేనెన్నడూ కోరుకున్నది లేదు. నమ్ము. విధితో కోసుకున్నప్పటి వైరాగ్యం ఇది. అందివచ్చిన

అవకాశాన్ని నిలుపుకుంటానని, నలుగురి మొహంలో నవ్వుని వెలిగిస్తానని, పిడికెడెంత ఆసరా పిల్లలకి ఇచ్చి పిట్టల్లా ఎగిరేలా తీర్చిదిద్దగలననీ.. నీకు తెలియంది కాదనుకో, బతికించుకున్న ఆమెకి ఇచ్చుకున్న మాటలు కొన్ని ఇప్పటికీ ఎప్పటికీ మరిచేవి కావు.

అయినా, ఎవరి నమ్మకం మీద ఇన్నాళ్ళూగడిచాయో, ఇప్పుడూ అట్లాగే గడుస్తుందని నమ్ముతున్నా..

ఉపరితలం మీద నిష్కామంగా పరావర్తనమయ్యే నేను, ఉనికిలో దాచేసిన నిప్పుల సంగతి నీకు తెలుసు. ఇప్పటికీ... ఉచ్చుల్లో చిక్కుకున్న వాళ్ళకి – వలల్లోని సంతోషం గొప్పదనే చెప్పుకుంటున్నా.. కొన్ని సంధ్యావస్థలు దీనికి సాక్ష్యాలు. నన్ను మన్నించు.

ఇంతకంటే నా చేతగానితనం గురించి ఇంకేమీ మాట్లాడలేను.

❖ ❖ ❖

ఎందుకిలా ఉండటం?

పెదిమలమీది చిరునవ్వుని తుంచుకోలేనంత నిస్సహాయంగా, కొందరు ఆశావహుల మధ్య – కొంత నిరాశని పాతిపెట్టి, ఆకురాలు కాలంలో అసందర్భంగా చిగురించే ఒక తటస్థకాలాన్ని ఊహించుకుంటూ... నువ్వన్నట్టే జనాలమధ్య ఒక నిర్జనవారధిలా, నిష్కల్మష ప్రాణిలా, లేలేతపూలని గుచ్చే ముళ్ళతీగల కబుర్లు చెపుతూ–

ఎందుకో! నిన్ను మించిన మనుషులెవరూ తారసపడరని తెలిసినపుడు, మృత్యువుగా పిలవబడే నీకు, ఉన్న ఒకే ఒక తేలికైన దేహాన్ని వినయవిధేయంగా సమర్పించడం, ఎందుకో – నాకు ఒప్పని విషయం.

❖ ❖ ❖

అవును!

ఆకురాలుకాలంలో ఆ బంగారువన్నె సంపదలమధ్య ఎన్నిసార్లు బెరడు పగుళ్ళలో చకచకా నడుచుకుంటు పోయిందీ ఎన్నిసార్లు ఉడుతవీపులో నునువుగా, వయ్యారంగా కదిలిందీ నువ్వెన్నిసార్లు ఆ చిరిగిన రవిక గుడ్డని పదేపదే కట్టుకుందీ పసరుకాయలు దోసిళ్ళునింపు కుని కడుపారా తినిపించుకుందీ..

చిన్నోడా.. అని పిలవంగానే వేగంగా పరుగెత్తిరావడం, మొహం మీద కదలాడే ముంగురుల్ని జరుపుకుంటూ తీవ్రమైన మోహంతో ముద్దాడి గెలవడం, ఉక్కిరిబిక్కిరి చేసే చేతివేళ్ళని ఒక దీనమైన చూపు అదుపులోకి తీసుకోవడం..

నెమళ్ళ అరుపులకి పాకిన భయం, అడవిలో గట్టిగా హత్తుకున్న సమయం..

అన్నీ గుర్తున్నాయి. అన్నిటిని అన్నీ–

ఇవ్వాళ వేపాకులగాలిలో ఒక పసిదాని భుజాల మీద చేతులువేసి, దాని కళ్ళ వెలుగులో నిన్ను పోల్చుకుంటూ, ఒకటనుకున్నా..'అమ్మలాగే చూసుకుంటా. ఎక్కడికన్నా వెళ్ళి, మునుపటిలా కొన్ని రోజులన్నా బతికొద్దామా ఇద్దరం?'

'వద్దు!' నాలోంచి నాకే ఒక నిరాసక్త సమాధానం.

కళ్ళలో కాస్త కన్నీటి తడి.

❖ ❖ ❖

నిజమే! ఎందుకీ బతుకు?

కొన్ని రంగురంగుల పువ్వుల్ని ఒళ్ళంతా కప్పుకొని, ఆదిమవాసిలా, అడవులదారుల్లో, అబద్దమాడని కవిత్వాన్ని జోలెనిండా వేసుకొని, మరణాల మీద దొర్లీదొర్లి సంపాదించుకున్న నల్లటి మచ్చల్నీ, ఎముకలుగా మిగులుతున్న బక్కపలుచని శరీరాన్నీ..

ఎవరికీ చెందలేని వారసత్వాన్ని మోస్తూ.. నిజమే! సేదతీరాల్సిన చోటే అలసిపోయాను. ఒక్కటంటే ఒక్క అడుగు కూడా వెనక్కి పడని మృత్యుగుహముందు.. ఏముందింకా

చేసేది? గుడిలోంచి దొంగిలించుకొచ్చిన కొబ్బరిచిప్పను-దైవంగా ప్రతిష్టించుకున్నవాన్ని. అమ్మల కన్నుల నీటి ముత్యాల్ని నాన్నల తప్పుకి దండలల్లి, నిజమే! ఇప్పుడు-ఏ శక్తినని ఆరాధించను?

సుఖానికి, సంతోషానికి, జీవితానికి, కవిత్వానికి, అనుభవానికి, ఆస్వాదనకీ ఒక రేఖామాత్ర వైవిధ్యాన్ని గుర్తుంచుకున్నానో, గుర్తించుకున్నట్లు భ్రమపడుతున్నాననో తెలీని నేను.. ఏ విషయమూ గుర్తించుకోలేదనీ, ఆరాటానికే అలవాటువడ్డానని, అనాగరికతని విడువకుండానే అనాగతంలోకి పరుగులు తీసానని.. మరింత ఏకాంతాన్నీ, మరింత దుఃఖాన్నీ, మనసారా.. దేహాన్నీ, హృదయాన్ని వదిలి కేవలం మనసారా కోరుకుంటున్నాననీ..

చెప్పనా? రాసిగా పోసి ఉన్న ధాన్యపుకుప్పలోంచి జారకుండా ఒక్క గింజైనా తీసుకోలేని పక్షినై, ఆకలిని పూర్తిగా ఏవగించుకుంటూ, గుక్కెడు నీళ్ళతో కడుపు నింపుకుంటూ.. పరిపూర్ణం కాలేని విషయజ్ఞానం సగమైనా భౌతికమని తెలుసుకున్న జంతువునై..

ఆలస్యం చేయకుండా, అల్పత్వం, అహం, అధికారం అన్నీ విడిచి, పిట్టలు గూటికే ఎగిరే సాయంత్రం పూట - ఇంకా ఏదేదో ఆలోచిస్తున్నానని.. చాలా విషయాలే తెలివికొచ్చాక నీక్కూడా నాలాగ అనిపించకతప్పదేమో!

❖ ❖ ❖

కొసమెరుపుగా, ఒక మంచి విషయం.

నీలోంచి ఒక పురాతన స్వరం వినిపించినప్పుడు.. నీలాగే స్పందించలేననీ, ముందుకు నడిచినంత సులువుగా వెనక్కి నడపడం వీలు కాదనీ, అన్నిటికీ మించి.. కాలిపోయిన కొన్ని క్షణాల అంచుల్ని అమృతం కురిపించి బతికించలేననీ.. మునుపటి నగ్నత్వంతో ఎవర్నీ చూడలేనన్న అపనమ్మకంతో, కలిసిమూసిన దారులూ, కలిసివేసిన తలుపులు అన్నీ

ఒకసారి మననం చేసుకుంటూ, పేల్చుకున్న గుండెలోంచి పోటెత్తిన రక్తంలో తడుస్తూ–

తెలుసా? తడిసీ తడిసీ ఎర్రటి రక్తపు దేహంగా మారి కనలిపోతున్న ఒక సంధ్యావస్థలో.. ఇప్పుడు..

ఎండపూల చెక్కిల్ల మీద వెన్నెల వికాసం, నక్షత్రాల ఉదయం, మౌనంలోకి లాగబడుతున్న దుఃఖపు కెరటాల్ని.. లాలించుకుంటూ నీ అంతిమస్పర్శ.

●

2

దేవీ!

ఎందుకు ఏడుస్తానో తెలీదు.

కన్నులు రెండూ ఒకే ఒక తీవ్రమైన కోరికతో మసకబారి లోకమంతా కనిపించకుండాపోయినపుడు

దేదీప్యంగా వెలిగిన నీ ముఖవర్ఛస్సు గుర్తొచ్చో, నువ్వు పాడిన పాటలన్నీ వినిపించో, సర్వస్వం తెలుసుకున్నానన్న సంతోషంతోనూ, సర్వస్వం కోల్పోయానన్న దిగులుతోనూ పసివాడిలా వెక్కివెక్కి ఏడుస్తూ బాధాతప్తదేహంతో నిన్ను కోరుకుంటాను.

ఏడ్చీ ఏడ్చీ గొంతుక పొడిబారినప్పుడనుకుంటా–

గాలిలో నీ చేతివేళ్ళు కన్నీటిని తుడుస్తాయ్. ఆపై గాలి కూడా మాయమవుతుంది.

❖ ❖ ❖

దేవీ!

దేనికోసం వెతుకుతానో... ఎప్పుడూ, ఒంటరిగా, ఏమాత్రం మార్పుచెందని అవే అస్కలిత క్షణాల మధ్యలో అర్థించడాన్ని వెలివేసిన పురాస్మృతిలోనే ఇంకా కాళ్ళీడిస్తూ, ఇంకా ఇంకా చేతులు కాల్చుకుంటూ కొన్ని సులువైన పదాలని, ఎవరికి అంతుపట్టనంత వివరంగా పేర్చుకుంటూ మిగిలి ఉన్న ఉనికిని సైతం జ్ఞాపకాలకి బలిపెడతాను.

ఒక నిర్నిద్రలో కలలని కొన్నిటిని రంగుల్లో ముంచి తీస్తున్నప్పుడు అవిశ్రాంత ఎడారిలో నీ ముద్దు దొరుకుతుంది. ఎడారిలో నన్ను కొత్తగా కనుగొన్నానని ఎవరికి చెప్పాలో అర్థం కాదు.

❖ ❖ ❖

దేవీ!

నువ్వూహించగలవా?

కొసరంత పిరికిగా, కొండంత నగ్నంగా ఆవహించిన ఉక్కపోత రాత్రిలో కూడా ఏ దాపరికంలేకుండా అంతే గట్టిగా హత్తుకుంటూ, అంతే గుట్టుగా ఉండమంటూ దారుల మీది పువ్వులతేజాన్నీ, సంద్రం మీది వెన్నెలచారల్నీ గుప్పిట్లో పట్టుకొని ఏది కావాలో కోరుకొని తీసుకోమన్నప్పుడు– నేను పువ్వులాంటివాన్ననీ, వెన్నెల్లాగా పరుచుకునేవాన్ననీ గుర్తొచ్చి పిచ్చిగా కాసేపు నవ్వుకుంటాను. నీ స్పర్శ ఒక గుర్తు. అది కూడా మాయమయినప్పుడు శూన్యం నా దేహంమీద పరావర్తనం చెందుతుంది. నా దేహధూళి నక్షత్రాల్లో కలిసి మాయమవుతుంది.

❖ ❖ ❖

దేవీ!

అసహ్యించుకోకు. చేసిన యవ్వన ధ్యానమంతా ఒక స్పర్శకో, జన్మకో సరిచూసి– మహోగ్రంగా జ్వలించే దేహాగ్నిలోకి ఉమ్మివేయబడే అనుగ్రహాన్ని ఊహించలేని అశక్తున్నై ఇపుడు కూడా నన్ను దాచుకుంటాను. ఎప్పటిలాంటి పిలుపులతోనే కాలాన్ని వెళ్ళదీస్తాను. కాలం కాళ్ళ కింది నుండి అటూ ఇటూ దూరిపోతూ పసిదానిలా పరిహాసాలాడుతున్నా ఓర్చుకున్న పరాగసంధ్యలన్నిటిని ఒడిలో పట్టుకొని అమ్మలా లాలిస్తున్నా అంతా నా భాగ్యమే అనుకుంటాను.

నిన్ను దర్శించుకున్నా లేకున్నా కొండల మీది యుగాలు కొన్ని విసుగ్గా విరిగి మిట్టమధ్యాహ్నపు ఒంటిమీద గాయాలు చేసి సంబరపడ్తాయ్.

నేను మాత్రం సశేషం.

●

3

నరాల్లోకి ఇంకిన రక్తపు కాంతికి
భస్మమై చిగురించిన చీకటిచారల్లో

దేవీ!
ఎందుకు ప్రసరించావు నన్ను?
ఏ చీకటినీ తాకలేని
ఏ గుహలోకి ప్రవేశించని
ఏ ఒక్కరాత్రికి సంతోషమివ్వని
కాంతిధారనై
ఏ మనిషికీ చూపివ్వని
ఏ పువ్వులోనూ వికసించని
ఏ కాలమందునా చిగురించని
కాంతిదారినై

దేవీ!
ఎన్ని ఉదయాస్తమయాలు లెక్కించుకోను?
క్షణాలిక్కడ శిధిలాలయాలు
నిమిషాలిక్కడ శిలాజాలు
కోరికలెప్పుడో గతించిపోయెను

మిగిలున్న ఒకే ఒక చీకటిబుుతువులో
హృదయాన్ని పరిచి, ఆకాశాన్ని పేర్చి
కన్నీటి చుక్కలతో నక్షత్రాలార్పుతూ

దేవీ!
ఎట్లా ప్రసవించావో
పిల్లల్ని పువ్వుల్లా
బండరాళ్ళని పిల్లల్లా
ఆత్మని అక్షరంగా
అక్షరాన్ని ఆత్మగా

ఎందుకిపుడు దేహంనీది
భారంగా కదులుతోంది?
ఎందుకిపుడు పిలుపు నీలో
క్రూరంగా సమసిపోతోంది?

నా దేహస్పర్శనీ, కేరింతనీ, పసిపల్కులనీ
తీవ్రంగా మోహించిన
దేవీ!

ఎందుకిపుడు శబ్దం శక్తిలేనిదై
అర్థమవసరార్థమై
జ్ఞానపు సమవర్తిముందు వైతరణిలో
మునకలేస్తోంది?

ఎందుకిప్పుడు దృశ్యం అదృశ్యమై
బుద్ధినంతటినీ మసకజేస్తోంది?

దేవీ!
ఇలా రా!
నన్నిక్కడ కాల్చుకుంటున్నాను
ఈ పరిమళపు చందనాల్లో
నీకేదన్నా ఆనవాలు దొరకగలదేమో చూడు.

నేను–
నేను తెలుసుకదా?
నేను ఇక్కడ సమాప్తం.

నేను
సరోవరాల ధ్యాసలో ఒక్క ఎడారినీ తడపలేక
అడవి మధ్యలో ఒక్క ఆకునీ మొలకెత్తించలేక
మనుషుల మధ్యలో కాస్తైనా దుఃఖాన్ని రగల్చలేక
నవ్వుని చల్లార్చలేక

ఇసుకరేణువునై, ఇసుకనేలనై
ఇసుక ఎడారినై
చివరిగా
సూర్యుడిలాగే కోరికలన్నిటినీ ప్రతిబింబించగల
దేహసరోవరాన్ని కనుగొని
బుద్ధికి స్నానంపోసి
ఆత్మను పునఃధరించి
అవధూతలా నగ్నమై
నిన్ను హత్తుకున్న వాన్ని.

నేను
నిరపేక్షగా, నిర్భయంగా
తప్పుల్ని కాల్చి, తపస్సునుగాంచి

నీ కళ్లముందరా, కాళ్ళదగ్గరా
మోకాళ్ళమీద నాట్యం చేసినవాన్ని.

నేను
ధార్మికమైన కర్మలందు చరించి
నిష్కామభావనల అంతరార్థాన్నీ
తమస్సురంగుల అంతర్ధానాన్నీ
హృదయపు కుంచెను రక్తంలో ముంచి
చిత్రవిచిత్రంగా గీసినవాన్ని.
విచిత్ర చిత్రంగా అనుకున్న వాన్ని.

దేవీ!
నిన్నెట్లా పిలవనిపుడు?
ఎట్లా గానం చేయనిపుడు?
నా ధ్యానమంతా
నిన్ను మనసారా అమ్మా అని పిలిచిన
కాలమహిమతోటే స్థాపితం.

దేవీ!
శృతిచేయబడని దేహాకృతులను
సవరించలేని సంచారధ్వనితనై
అక్షరాలు మలినపడి
పిట్టలు టపటపా రెక్కలుకొట్టుకుంటున్న గొంతుకలోంచి
మాటొక్కటీ రాని పసివాడనై..

దేవీ!
మరణకాంక్ష దిక్కులుదిక్కులుగా
పెనవేస్తున్నప్పుడు

తిరిగిన గుట్టలమీద
తెలియని గుట్టుని వెతికి–ఓడిపోయి
తిరగని ఆలోచనలో తెలిసిన రహస్యాలనే
పదేపదే విని– గెలిచిపోతూ..

దేవీ!
ఇలారా!
నన్ను ఒడిలోకి తీసుకో, హత్తుకో
అదే జోల మళ్ళీ పాడు
అదే అంతర్వాణి మళ్ళీ వినిపించు.
దేవీ!
అడవెట్లా మోహించేదీ
తెలుసుకదా?
ఆకురాలుకాలం చివరలో, అగ్నిని ఆమె పిల్లల్లాగా
అంతటిదేహంతోనూ మోహిస్తుంది.
కుప్పగా పోసిన రాళ్ళమధ్యలో
ధృడంగా ఎదిగేటి శక్తి గలదై

దేవీ!
ఎందుకు నన్ను నగ్నంగా అనుగ్రహించదలిచితివో
ఆగు
రాళ్ళ కిందా, రాలిన ఆకుల కిందా పాతిపెట్టబడిన
మనసుని వెతికిస్తా.
నువ్వు నగ్నంగా బలికోరినా చిర్నవ్వు నవ్వే
దేహాన్ని తెచ్చి నీ సన్నిధిలో నిలబెడతా.

దేవీ!

నరరూపాన్నమును.
నన్ను భుజించు.
ఎట్లా నీ దేహం నుండి ప్రసవించావో
అట్లే నీ కడుపులో దాచుకో.
త్వరగా
త్వరత్వరత్వరగా
నీ నిర్ణయాన్ని తెలియజెయ్యి.

దేవీ!
పర్వతశిఖరం కూలుతోంది.
తల భరించలేని నొప్పితో చిధ్రం కాబడుతోంది.
నా తలనొదిలి దేహమంతా పాతిపెట్టమందువో
నా దేహమొదలి తలమాత్రమే పాతిపెట్టమందువో
ఏది చేసినా పాతకమని పక్కకి జరగమందువో
ఇంకా..ఇంకా..

నా దేవీ!
దేహం దేహాన్ని కోరుకున్నపుడు విడివడ్డ ప్రాణాన్ని
మనసు మనసుకి అతుకున్నపుడు విడివడ్డ ఆలోచన్ని
ఇప్పుడు
ఏ గతీలేక కూలబడ్డ సత్తువనై
ఎండిన రక్తాన్ని ఆవిరయ్యే నన్ను

దేవీ!
నా దేహస్పృహని నువ్వొక కాంతిస్పర్శతో స్పృశించు.
నా కోసం ఒక కొత్తదారిని సృష్టించు.
కాంతిలో కొంత విద్యుచ్ఛక్తిని
నరాల్లోకి పాకించి

నవ్వించీ నవ్వించీ
నన్ను కూడా బతికేలా చెయ్యి.

దేవీ!
సత్వమూ, రజస్సూ విసిరివేయబడ్డా
ఎన్నడూ నిరాశ చెందని సంకల్పంతో
ముడుచుకునే కాళ్ళతో ఒకటీ
విచ్చుకునే చేతుల్తో రెండూ
మొత్తంగా మూడు ముడులు వేసి
నిన్నొప్పించగలనని కలగంటూ

దేవీ!
సమయమింకా మిగిలే ఉన్నది.
నిన్ను ప్రకటించుకో..
నేనూ నీ వలెనొక మోహాక్రాంత పశువును–
జన్మాంతరాల బేధాన్ని సమానత్వంగా భావించుకొని
అడవినంతా మేయగల బుద్ధిహీనుడను.
అన్యదాభావించనియెడల
మాంసాన్ని మాత్రమే వాంచించు క్రూరజంతువును.
లేదా
తద్విద్యుల్లతల మెరిసే పుష్పకాంతిలో
భ్రమరమై చలించు మనసును.
నిశ్వాసగాలికి మిణుగురుల వెలిగే అపసవ్య చిత్తమును.

దేవీ!
సహాయనిద్ర ఆసన్నమైనది.
నీదొక్క కన్నెప్ప వాలగలదో, నాదొక్క కన్నెప్ప వాలగలదో
ఇరుసంధ్యలూ మెరియు రాత్రి చీకటిలోన
ఇద్దరం రెండ్రెండు వాల్చుతామో

ఏమో–
శిక్షాస్మృతి నడి మధ్య పేజీలో
ఇద్దరి విలువలు హత్యచేయబడతాయో

దేవీ!
లోకానికొచ్చిన దారి నీకు తెలుసు.
ఏ నీలాంబరాల పొత్తిళ్ళ మీద నన్ను పడుకోబెట్టిందీ
ఏ ధవళమేఘాల్లో నన్ను మోసుకొచ్చిందీ
నాకు లాలపోసిందీ
అన్నీ నీకు తెలుసు..

ఇక
ప్రయాణానికి సిద్ధపడ్డవాడికి
ప్రతీదేశం ఒక కొత్త అనుభూతినివ్వొచ్చు.
ఒక పురాస్మృతిని మండించవచ్చు.
అవతారాలు చాలించడానికి ముందే
జన్మల ప్రస్తావనుయను ఈ మిథ్యను కూడా
బూడిదచేయవచ్చు.

నిజానికి
నేను సశేషం.

4

దేవీ!
నేనూ పరధ్యానంగా ఉన్నా
నాకంతా తెలుస్తూనే ఉంది.
గడువు ముగిసింది.
నువ్వు రావట్లేదు.

❖ ❖ ❖

గడువు ముగియబోతుందని ముందు నుండే తెలుసు.

ముక్కులోంచి రక్తం కారి మునుపటి రోజుల్ని గుర్తు
చేయడం.. నీ మణికట్టుపైని గీతలు చేరి దృశ్యాలన్నీ
మాసిపోవడం.. రక్తంతో కాగితాలు తడిసిపోవడం...

అక్షరం కూడా రాయలేనని, అందరూ ఒకేసారి సాక్ష్యం
చెప్పడం.. సంజ్ఞలు కొన్ని... స్వప్నాలు కొన్ని...
రాత్రి దేహం మీది గాయాలు ఇంకొన్ని...

❖ ❖ ❖

దేవీ!
రోజూ పొద్దున్నే, కలలాంటి ఒక దృశ్యంలో
సంచరిస్తున్నపుడు.. ఏదో నిశ్శబ్దం
ధభేల్ ధభేల్‌మని చప్పుడూచేస్తూ నన్ను పిలుస్తుంది.
తలుపుతీసాక కారణమేదీ కనిపించదు.
లోపలికొచ్చాక దృశ్యమూ అగుపించదు.
భయంభయంగా అడుగులేసాననిమాత్రం
గుర్తుండిపోతుంది.

మధ్యాహ్నం, ఒక నిద్రలాంటి కలలో దొర్లుతున్నపుడు
ఎవరో ఒక మనిషి ఎలా ఉన్నావంటూ పలకరిస్తుంది.

'ఎవరామె? ఎవరి నగ్నత్వానికి ప్రతీక ఆమె?
ఎక్కడి ధవళకాంతిని ధరించి, ఎందుకు అశరీరమై నన్ను
పరీక్ష చేస్తోంది? ఏ నిష్కల్మష ప్రపంచానికి నన్ను
లాక్కెళ్ళాలని చూస్తోంది?'

ప్రశ్నలు సుడిలో కొట్టుకుపోతూ సమాధానం కోసం
చెయ్యి చాస్తాను. నన్నెవరూ పైకిలాగరు.
మరణసదృశమైన గాఢనిద్రలోకి నన్ను పారేసుకుని
మునిగిపోయాక
అంతా నా కోసమే అన్నట్టు..
మనిషిజాడేలేని వింతలోకం
ఒకటి స్వప్నించబడుతూ సాయంకోరుతుంది.

నేను ఒప్పుకుంటాను.

❖ ❖ ❖

దేవీ!
రోజూ సాయంత్రం, పాతిపెట్టుకున్న నన్ను కొంచెం
తేనీరు చల్లి నిద్రలేపి ఒక మెలకువ సృష్టించుకున్నపుడు,
మట్టిలేని గుండెలో పువ్వులెట్లా పూస్తాయని ఆత్మని
శోధించుకుంటున్నపుడు –
కొన్ని పక్షులు తిరిగి రావడం నవ్విస్తుంది. వాటి ఖాళీ
చేతులేవో సందేశమిస్తాయ్. ఎర్రని ఆకాశం చీకట్లో
మునుగుతుంటే మేఘాలకీ, నాకూ
లాలపోసినట్టనిపిస్తుంది. వెన్నెల సంజ్ఞ కొన్ని స్వప్నాల్ని
బతికిస్తుంది. కొన్ని స్వప్నాల్ని తుడిచేస్తుంది. నన్ను
మసకలోంచి తప్పించాలని విశ్వప్రయత్నం చేస్తుంది.

❖ ❖ ❖

రాత్రి.
ఇది చివరిది.
నన్ను మిగల్చకుండా చేసేది.
గడువు ముగిసిందని నన్ను పదే పదే హెచ్చరించేది.

దేవీ!
నేను తప్పించుకున్న రాత్రిలో దృశ్యం
మంత్రించబడుతోంది.
నన్ను తప్పించుకున్న రాత్రిలో శబ్దం
హత్యచేయబడుతోంది.
వేచి ఉండాలనే కోరిక నన్ను సహజంగానే చిత్రవధ
చేస్తున్నప్పుడు,

ఆమె నీలాగే కనిపించినా, నువ్వనే ధ్యాస రాని ప్రశ్నల్ని
అణచివేస్తూ,
ఆర్తిగా, ఆశగా హత్తుకునే నీ చేతులకోసం
ఎదురుచూసాను.
నా చివరిశ్వాస?!
దేవీ!
ఎప్పటిలాగే, ఈ రోజు కూడా
మెలకువ చివరి అంచువరకి
ఎదురుచూస్తుంటే
గడువు తీరిపోయింది.
నువ్వు రాలేదు.

బహుశా–
నీకు రావాలని లేదు.

5

దేవీ!
ముగ్ధనిశీథిలో
ముచ్చటగొలిపే చీకటి కురిసేవేళ
మనుషులెవ్వరు చూడలేని సందిగ్ధక్షణాల నీడల మధ్య
నక్షత్రాలు శ్వాసలో
చీకటితోనే రక్తమో
ఏమో! నాకొకటే తెలుసు.
నాకు ప్రాణం పోసావు.
దుఃఖభాజకమగు జీవితం గుప్పిట్లో హృదయాన్ని చేర్చావు.

దేవీ!
విషయపు ధూళి
వలయవలయవలయాలుగా నన్ను కమ్ముకున్నా
సహస్ర బాహువుల్తో శూన్యం నన్ను అల్లుకున్నా
ఆకాశమే అంతరించి, తన ఉనికిని వెతుక్కుంటూ
సంచరించినా

నీ సంకల్పం వృధాపోదు
నన్నేదీ ఇక ఆర్పలేదు.

❖ ❖ ❖

దేవీ!
పున్నమి పోటెత్తినపుడు
అలలు అలలుగా కాంతి చిధ్రమై
ప్రాణంతో సంగమించే ప్రయత్న ఉద్విగ్నతలో
వెన్నెల మృత్యువనో
కలయిక పాపమనో
ఏమో! నాకర్థం కాదు.
నన్ను వేలాడదీస్తావు.
బతికించిన నువ్వే, స్వర్గద్వారపు గడపదగ్గర నన్ను
ఉరితీసిపోతావు.

దేవీ!
మరణకాంక్ష
దిక్కులనిండా ఆవరించి ఊపిరితీసినా
దిగంతనిర్భయసంతృప్తతని ఆవిష్కరించినా
అపారదర్శక సంధ్యాకాలం, మహాకాళమై సూర్యున్ని
మింగినా

నిన్నెప్పటికీ తెలుసుకోలేను.
నేనెప్పటికీ పూర్తికాలేను.

6

దేవీ!
నక్షత్రాల గుంపుతో ఆటలాడి
దగద్ధాయమైన వెలుగుతోనూ, మిరుమిట్లుగొలిపే
మేనిఛాయతోనూ
నేలమీద సౌమ్యంగా అడుగుపెడుతున్నపుడు..
నన్ను మించిన సమ్మోహనశక్తేదో
సముద్రంలో తిరుగాడటం తటస్థించింది.

నిద్రపోతున్న సముద్రంలో అలలు అలలుగా కలలు–
అవ్యక్తానుభూతిలో మునిగితేలుతూ జీవన్మయ ప్రపంచం–
తెలుసా?
అది ప్రాణాంతకమని తెలుసుకునేలోపే తీరం నన్ను
చుట్టేసి
నేలగర్భంలోకి లాక్కుంటూ తీసుకుపోయింది.
నా అశక్తతనీ, చంచలత్వాన్నీ మరోసారి గుర్తుచేసింది.

❖ ❖ ❖

దేవీ!
అదృష్ట బిందువులన్నీ కలిపి– అస్పష్టంగా ఒక వృత్తం
గీసాను. కొద్దిసేపు మెరిసిపోయింది. కొద్దిసేపు అదృశ్యం.
ఆశ్చర్యంగా దాని పరిధి నిండా సాంద్రమైన భావాలేవో

నిండిపోయినట్టనిపించింది.
ఇక మళ్ళీ కొద్దిసేపు మెరుస్తుందనుకున్నప్పుడు
చొరబడలేని ఒంటరితనమేదో లోతులదాకా ప్రవేశించింది.

అది
ప్రతీ నరంలోంచీ, ప్రతీ కణంలోంచీ, ప్రతీ రక్తపు
బిందువులోంచీ నన్ను శాసించింది.
నన్ను పూర్తిగా లోబరచుకుంది.

దేవీ!
ఏం చేయనిపుడు?
గుండె ప్రతీ నరంలోనూ సవ్వడిచేస్తోంది.
శ్వాస ఉన్నదో లేదో..

ఆకాశం ముఖమంతా పరుచుకొని, రాత్రులన్నిటినీ
ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఉక్కపోతకి దేహం మిగిలేలా లేదు.
ఎన్ని ప్రశ్నలు వేసుకున్నా, ఎంత దాహం నిలుపుకున్నా
దుఃఖనివృత్తి జరిగేలా లేదు. ఒక్క ఆనవాలూ దొరికేలా
లేదు. ఆహారమేదీ తృప్తిగా లేకో, మసకలో మనిషెవరూ
కనిపించలేకో దేహానికసలే స్పృహలేకుండాపోతోంది.

❖ ❖ ❖

దేవీ!
స్పర్ధించుకున్న సంగీతమంతా
ఒకే ఒక ప్రణవమై వినిపించినట్టు...
స్పర్ధించుకున్న చంధస్సు నిండా
ఒకే ఒక అక్షరం కనిపించునట్టు...
స్పర్థించుకన్న రుధిరాంశలన్నీ

ఒకే ఒక బిందువై రిక్తమైనట్టు...
త్వరగా
త్వరత్వరగా
నన్ను అనుగ్రహించు.
ఆహ్లాదకరమైన జీవ చైతన్యాన్ని
ఎంతో కొంత నాకు పరిచయం చెయ్యి.

❖ ❖ ❖

దేవీ!
నన్ను నమ్ము.
సంచారేచ్ఛ పెచ్చగిల్లే ఈ సంధ్యావస్థ కాలమంతా
తక్షణమే నీ మోకాళ్ళపై సేద తీరుట తథ్యం.
ఏకరీతినొందని ప్రతీ పదార్థాన్నీ
ఏకరీతి స్పందించే ప్రతీ హృదయాన్నీ
ఏకాత్మక సృష్టిలోని ఏకాంతాన్నంతటినీ
లయం చేసే రహస్య శూన్యమైన–

దేవీ!
నీ అనురాగభరిత దృక్కుల కింద
నన్ను నిదురపుచ్చు.
నీ దయ నిండిన స్పర్శతో
నన్ను శుభ్రం చెయ్యి.
నిస్తేజమైన ఈ భౌతిక దృశ్యాలన్నీ
సంశయమేలేకుండా లోపలినుండి తీసివెయ్యి.
నీ మధురమైన లాలిపాటతో
ప్రేమగా నన్ను అంతం చెయ్యి.

ఓంశాంతి శ్శాంతి శ్శాంతిః

అనుకోకుండా...

1

పువ్వులు వికసించడం చూసామంతే–
నువ్వు వేరు – నేను వేరు.
ఇద్దరం చిగురించే రూపాలు వేరు.

నీ మాటలు కొన్ని తుంపరతుంపరగా
మట్టిలో కలిసి తనువంతా జలదరిస్తాయ్.

కాదన్ను!
నీ స్పర్శ నాకు హాయిగా ఉంటుంది.
నీ ప్రతీ నవ్వులోను సూర్యుడు ఉదయిస్తాడు.

అయినా
మనం వేరు.
ఆనందించే ఋతువులు వేరు.

❖ ❖ ❖

ఇదిగో! ఇలా రా!
కోప్పడన్లే.. నువ్విష్టం.
ఎవరికీ చెప్పనంటే ఇంకోటి చెప్తా.

ఇద్దరివీ రెండు దారులు. లేదా
ఇద్దరం ఒకే దారిలో

వెనక్కి నడుచుకుంటూ వచ్చినవాళ్ళం.
కాదంటే
ఒకేదారిని వెతుకుతూ నిలుచున్నవాళ్ళం.

కొన్ని అబద్దాల నేను.
కొన్ని రహస్యాల నువ్వు.

పరుగెత్తలేం.

సమయాన్ని స్పష్టంగా చిత్రించాలి.
అదీ రంగుల్లేకుండా, కేవలం కొంచెం
చీకటిని మాత్రమే చేతులకి రాసుకొని –

ఇలా, అచ్చం ఇలా
కొన్ని తేలికైన పదాల్తో
గడిపే అర్థంలేని జీవితంలా..

❖ ❖ ❖

కలిసి ఉందామా?
నిన్నేమి అనను.
వేరని గుర్తుచేసినా పట్టించుకోవద్దు.

పసివాడి ఏడుపుకి నిశ్శబ్దం పగిలినట్టూ
రంగులు చొచ్చుకుపోయి దేహం మెరిసినట్టూ

కలిసి ఉందామా?
నిన్నేమి అనను.
వేరని గుర్తుచేసినా
ఎందుకని అడగొద్దు.

2

వస్తారు. పోతారు.

కాళ్ళని విరిచి కదలకుండా
చేతులు విరిచి రాయకుండా
మనసు విరిచి మాట్లాడకుండా

అందరూ నీలాగే/లేదా
నువ్వూ వాళ్ళలాగే
ప్రేమలాంటి మాయతోనూ/లేదా
మాయలాంటి ప్రేమతోనూ

❖ ❖ ❖

నిజానికేదీ మారదు.
నడిచే కాళ్ళు, రాసే చేతులు, పాడే మనసు
అంతా ఒక స్వప్నం.
అంతా ఒక అసంతృప్త అనురాగపు కాంక్ష.

ప్రాణం స్వప్నంలోకి వచ్చిపోతుంది/ లేదా
ప్రాణంలోకి స్వప్నం వచ్చిపోతుంది.

❖ ❖ ❖

సర్లే! ఏదో ఒకటి.
అనంతం చివర ఇంకో అనంతం ఉన్నా

నక్షత్రాలు కురిసినపుడు చీకటి వరదలెత్తడం
నువ్వూ నేనూ, పువ్వుల్లా రాలికొట్టుకుపోవడం
చచ్చుబడిన ఉపమానాల్లోంచి లేచే ఒక విరుద్ధమైన ఊహ.
అదెన్నటికీ నిజం కాదు.

ఏమవుతుంది మహా అయితే?!

ఆకాశం వెలిసిపోకముందే
పక్షుల్లా ఎగిరిపోతాం / లేదా
ఆకాశం కూలకముందే
మనుషుల్లా చచ్చిపోతాం..

3

కలిసాం. జన్మాంతరాల దుఃఖస్పర్శతో
ఇద్దరం ఒకర్నొకరం తడిమిచూసుకున్నాం.
పూలసజ్జమీది తేనియతోనూ–
పువ్వులు రాలేటి చప్పుడుతోనూ–
ఇద్దరం ఒకేసారి పాటనెత్తుకున్నాం.
ఇద్దరం ఒకేసారి బాసచేసుకున్నాం.

పనీ పాటా లేవిన్నాళ్ళు.
తినకుండా నిద్రపోవడం ఒక పగలు.
తిన్నాక నిద్రపోవడం ఒక రాత్రి.
కలలకు ఎన్నడూ అడ్డురాని
గాయాల శ్వాసతో గాలి.

❖ ❖ ❖

నిజానికి ఒకటుండేది
అచ్చం పాటలాంటిదే
ఒక జీవితం.

సంచారినై
మృత్యుముఖంతోటి
మృత్యుగానం చేస్తూ–

మృత్యువు జలపాతంలోకి దూకాలనిపోయేవాన్ని.
దూకడం తటస్థించేది.

తుంపరల నాట్యంలో కాంతించుకుంటూ..
ఆకాశం నుండి ఎవరు చూస్తారో–
చంద్రుని మొహం నీళ్ళలోపడి పగిలిపోయేది.
నేను మాత్రం ఆశ్చర్యంగా తేలిపోయేవాన్ని.

ఏమో!
దారిమధ్యలో నన్ను ఆకుగా మార్చిన
శక్తి ఎక్కడిదో –
ఏ దిక్కులోంచి ప్రవహించీ ప్రవహించీ
రక్తాస్థిమాంసాల్లో ప్రవేశించిందో –
కణజాలం మధ్యలోఊయలలూగిందో –

❖ ❖ ❖

ఎక్కడిదో మరి–
ఎప్పటికీ అంతుపట్టదు.
తరగల మీద కొట్టుకుపోతున్నప్పుడు
దిగులు కొమ్మ చిగురించడం గుర్తొచ్చేది.
గుండెసడి సెలయేరంతా వినిపించేది.

కొండలమీద కొంచెం ప్రతిధ్వని–
రాళ్ళు తాకించుకున్నవ్వుకునేలోపు
ఎందుకో మళ్ళీ ఆ పాతపాట.
మనిషిగా మార్చే ఇసుకతిన్నెలమీద
జీవితం అనబడే పాతపాట.

❖ ❖ ❖

ఎవరు నేర్పుతారు పాడటం?
పనిలేనివాళ్ళకీ, నాకూ–

ఎంతసేపు దీర్ఘంగా ఆలోచించినా
పువ్వులూ, వికాసం అర్థమవుతాయ్.
సంధ్యలూ, సంగీతం అర్థమవుతాయ్.
మానవనిర్మాణం
ఎన్నటికీ..

ఇదిగో, ఇపుడు నువ్వో
కొత్తరాగమై చేరినట్టు
నువ్వన్నా చెప్తావా?
ఎక్కడిదో పాట..

❖ ❖ ❖

ఎక్కడిదో పాట..
గుండెల్లోంచి ఉదయించి వచ్చిందో
ప్రాణంలోంచి పరుగెత్తివచ్చిందో
కలల్లోంచి కదులుతూ వచ్చిందో
స్వరంలోంచి ఎగురుతూ వచ్చిందో

ఎంతసేపని ఓపుకుంటాం?
ఊపిరి తియ్యలేం.
బాధని తీసివెయ్యలేం.
స్పర్శేదీ తెలీనివ్వని తిమ్మిరి సమయాన్ని
గిచ్చుకుంటూ గిచ్చుకుంటూ
పాటా, పనీ రెండూ సాగవు.
జతకట్టే నీ కాళ్లు కూడా
ఎప్పటికీ కనపడవని
ముందే తెలిసిపోతుంది.

నిశ్శబ్దమేదో ఆవరిస్తుంది.

❖ ❖ ❖

ఒక నిశ్శబ్దం

ఎండ – నీడల్లో సేదతీరినట్టూ
వర్షపురాత్రి – మబ్బుల్ని కప్పుకున్నట్టూ
చలిమంచు–పొద్దుపొడుపులో
వెచ్చ చేసుకుంటున్నట్టూ
నిశ్శబ్దం ఆవరించాక
ఎవరికోసం ఎదురుచూపు?

మౌనం మన రక్తనాళాల్ని
సాగదీసీ సాగదీసీ ఎండబెడుతుంది
మౌనం మన రక్తనాళాల్ని
తెంపుకుంటూ తెంపుకుంటూ ప్రాణంతీస్తుంది.
పాడటమూ పనేనని
పదే పదే గుర్తుచేస్తుంది.

పాడుతూ పాడుతూ పాడుతూ ఉంటే
రాగాలు ఒక్కటని తెలిసిపోతుంది.

4

రాత్రిలోకి
చీల్చుకుపోతాం.
వాదించీ వాదించీ.. రాపాడీ రాపాడీ..
మరణిస్తూ మరణిస్తూ సర్దుకుంటాం.
కూలబడటం తథ్యమని
తెలిసిపోయాక –
సర్దుకుంటూ సర్దుకుంటూ సాగదీస్తాం
ఇద్దరం ఒకటేనంటూ ఆనందిస్తాం

వెలుతురుదొర్లే ఉదయాలన్నిటినీ
నిశిద్రోహుల సంచలనం విస్మయపరుస్తుంది.
నిశ్శబ్దం ఒక్కసారే పెనవేస్తుంది.
కారణమేదీ ఉండదు–

అప్పుడప్పుడు
అరుదుగా వినిపించే ప్రతీ శబ్దంలోనూ
జీవితేచ్ఛ పూర్తిగా మాయమవుతుంది.
ఉనికి రహస్యం అవగతమవుతుంది.
సూర్యకిరణాల్లోంచి ధూళిరేణువులు
ఎప్పట్లాగే నిదానంగా కదుల్తుంటాయ్.

మరణం కొద్దిగా తప్పుకుంటుంది.

మరో కొత్తరోజు మొదలయ్యేలోపు
జీవితం మరోసారి ప్రాప్తించబడుతుంది.

మరో కొత్తబతుకు ముగించేదాకా
యవ్వనం వెంటాడి వేటాడుతుంది.

5

ఇద్దరం ఒకటని తెలిసిపోతుంది.
రాత్రులు సాగవు. సాగితే ఆగవు.
నువ్వు లేని గతమంతా నిరర్థకంగా తోస్తుంది.
నువ్వుండని భవిష్యత్తులో నేనూ ఉండను.

నువ్వున్న ఈ క్షణం–

నువ్వున్న ఈ క్షణం మాత్రం
యుగాల మౌనంతో సంభాషిస్తాను.
ఏమో! ఎవరికి ఎవరం ఏమవుతామో తెలీక
యుగాల ఏకాంతంతో బాధించుకుంటాను.

❖ ❖ ❖

వెన్నెల స్నేహితా!
ఏమీ తోచనివ్వని సమయాల్నిదాచి
ఒకరిదేహంలోకి ఒకరం
సందేహాలని వదులుకుంటాం.
ఒక మృత్యువులాంటి కాలం కోసమే
రేయంతా పరితపిస్తాం.
ఒక సంధ్యలాంటి సందిగ్ధంలో
ఉదయాస్తమయాల్ని పోల్చుకుంటాం.

చలనాలు ఆగవు.
చరిత్రలూ మారవు.

కళ్ళ కింద ఒంటరితనం కలవరపెడుతుంటే
పురాతన పరిచయమేదో మంత్రం వేస్తుంది.
పువ్వుల రంపంతో గుండెని కోస్తుంది.
ఏడ్పించీ ఏడ్పించీ మనిషిని చేసి
నవ్వించీ నవ్వించీ ప్రాణం పోస్తుంది.

❖ ❖ ❖

వెన్నెల స్నేహితా!
ఏడ్చీ ఏడ్చీ అలిసిపోయాక
నిదర్రాని పగళ్ళనిండా
దుఃఖంతో నన్ను నేను కాపుకుంటాను.
రాతిరి వెచ్చదనంకై ఎదురుచూస్తాను.
చిప్పిల్లేటి విశ్వాత్మ అంశలో
ఒద్దికగా ఓపికగా ముడుచుకుంటాను.
నువ్వే జీవితమని తెలుసుకుంటాను.
ఆత్మీయంగా హత్తుకొని ఒకసారి
ఆత్మనీ దేహాన్నీ శుభ్రం చేసుకుంటాను.

❖ ❖ ❖

దుఃఖిత సహచరీ!
ఒక ఓదార్పుకోసమే జన్మించి ఉంటామని
ఒక సాంత్వన కోసమే మాట్లాడుకుంటామని
బాధలేని కొన్ని క్షణాల ఊహలో
బతుకంతా కలలాగ గడిపేసి ఉంటామని
బతకలేని కొన్ని క్షణాల ధ్యాసలో
ఆకాశం చివర్లో సంచారం చేస్తామని

అంతా ఒకేసారి తెలుసుకుంటాను.

నిజానికంతా తెలిసిందే!
తెలిసిందే తెలియండై
అంతో ఇంతో అనుభవాన్ని పంచుతుంది.
ఎంతో కొంత అశాంతిని దహిస్తుంది.

6

వదల్లేమనీ, వదలగలమనీ,
వదిలేసి కూడా ఉండగలమనీ,
వదల్లేకుంటే బాధలేదనీ–
మనదే ఒక ప్రపంచమైనందుకు
విధిని కూడా ధిక్కరిస్తాం.
కొత్తరోజులు కొన్ని కోరుకుంటాం.

అనుకోకుండా, అనుకోకుండా,
అనుకోకుండానే

ప్రయత్నించీ, అలసిపోయీ
ప్రవచించీ, విసుగుచెందీ
బతికిన బతుకంతా బాధేనని ఒప్పుకుంటాం
బతకని బతుకంతా మనకేనని గంతులేస్తాం.
గడిచిన కాలంలోంచి మనదేదని వెతికితీసి
ఖాళీ చేతుల్నే కలుపుకుంటూ ఆసందిస్తాం.

❖ ❖ ❖

వదులుకోలేక అవస్థ–
వీలైనన్ని సంతోషాలకీ, చెప్పలేనన్ని బాధలకీ
నన్ను భాగస్వామిగా కోరుకున్నదాన!
సర్వస్వమూ నేనేనని తపించేదానా!

గాలిపీల్చడమే దివ్యత్వంగా భావించుకునే
సమయాలసాక్షిగా...

నీక్కాస్త వేదాంతం చెప్పనా?

విచారానికి సూత్రంలేదు.
అది ప్రకృతి స్వభావం.
ప్రాకృతంగా ధ్వనించే మన మాటల స్వభావం.
ప్రతిస్పందించే మన హృదయాల స్వభావం.
జన్మాంతరాల దుఃఖస్పర్శతో
ఉప్పొంగి ప్రవహించే ధమనుల స్వభావం.

విచారమెవరికీ స్వంతం కాదు.
అది ప్రతిమనిషికీ పరిచయంలో ఉన్నా
అర్హత మాత్రం కొందరికే.
నీకూ నాకూ– మనలాంటి కొందరికే.

❖ ❖ ❖

దుఃఖిత సహచరీ!
మనలాంటి కొందరుమాత్రమే
కనుచూపుమేరలో ఉన్నదంతా
ఆకాశమేనని పూర్తిగా నమ్మగలరు.
ఆకాశం బాధతో కురిసేముందు –
వేదనతో నిండిన ఒక్కొక్క చూపు
వేలనక్షత్రాల్ని తుడిపేయగలదనీ
ఆర్తిగా పిలిచే ఒక్కొక్క పిలుపు
వేలసందేశాల్ని చేరవేయగలదనీ
అంతా నిక్కచ్చిగా అర్థం చేసుకోగలరు.
అంతా నిజమేనని ఒప్పుకోగలరు.

7

దిగులుతోనే రోజులు గడుస్తాయ్. బతికున్నాననడానికి మాట్లాడడం ఒక సంకేతం. బతుకులోంచి మాట్లాడేవీ, బతకలేక మాట్లాడేవీ ఒకేలాగా ధ్వనిస్తాయ్.

కొన్ని పదాలేవో అట్నుండిటు దొర్లిస్తున్నట్టు అగుపిస్తాను. భారమైన ఆ పదాల కింద చేతులెంత నలిగేదీ చెప్పలేను. కాళ్ళనెలా కట్టేదీ విప్పలేను.

బతకడం పునరుక్తమయ్యే ఉదయాల్లో – నాపైన ఎవరో దాడిచేస్తారు. చీకటిని సృష్టించ ప్రయత్నిస్తారు. మసక నా గెలుపు. ఎట్లా విడదీసి చూసుకోవాలో.. ఎప్పటికీ నాకే అర్థం కాదు.

❖ ❖ ❖

కొన్ని రోజులు చిత్రంగా ఉంటాయ్. అస్థలితంగా బతికే రాత్రులన్నీ నిరర్థకంగా తోస్తాయ్. ఒక్కోసారి చీకటి పడదు. పడినా రాత్రవదు. అయినా నిదర్రాదు. దీక్షకి ఆపద.

స్వప్నం నా అద్దంలో ముక్కలుముక్కలుగా పగిలిపోతుంది. దేహం నిండుగా చొచ్చుకుపోతుంది. ఇక సమస్త అవయవాలు ఒకే అంగమై ప్రవర్తించినపుడు దేహమంతా ఒక ఓపలేని బాధ.

నేను మరోలా మారిపోతానో, మారలేక కూలబడతానో– ఇప్పుడప్పుడే ఏదీ చెప్పలేను. ఆగు. మెలకువ రాగానే ఊహకి హద్దుండే చోటొకటి వెతుక్కోవాలి.

❖ ❖ ❖

పువ్వుల సంద్రమా!

ఇప్పుడే ఇదంతా వద్దు. ఇంకా చాలా పనులు పూర్తిచెయ్యాలి. నా పురాతన భాషని కొంచెం సరిదిద్దుకోవాలి. సంపదలన్నీ సర్దుకోవాలి. తడిసిన హృదయం ఎట్టైనా వెలగదు. మళ్ళీ రాత్రంతా ఎండలో కూర్చొని వేగంగా వేగంగా పొడిచేసుకోవాలి. తూరుపు దోసిట్లోంచి సూర్యుడు రాకముందే ఊపిరినదుల్లో స్నానం చేసి రావాలి. వెలుగుతో ఒళ్ళంతా తుడుచుకోవాలి. నిర్ధయుడైన ప్రభువు ముందే నగ్నంగా నిలుచుని ప్రార్థనచేసి, వివశత్వమేదున్నా అబద్ధమని చెప్పాలి. నిజం సగమైనా తెలిసేలా చేయమని అడిగీ అడిగీ అలసిపోవాలి.

ఇంకా, నా వెన్నెల స్నేహితా!

గుర్తులన్నీ కుప్పగా పోసి వుంటాయ్. నచ్చినవి ఏరుకోవాలి. నచ్చనివి దాచుకోవాలి. పువ్వులు రాలేటప్పుడు చెట్లనీడల్లో అలికిడి కాకుండా, పువ్వులు రంపమై కోసుకుపోకుండా ఎంతో కొంత జాగ్రత్తపడాలి.

❖ ❖ ❖

'కలిస్తే కలుస్తాం. లేదంటే లేదు' పోన్లే.. ఏంటట?

రక్తంలోంచి నడుచుకుంటూ వచ్చాం. రక్తంలోనే సంచరిస్తున్నాం. ఏ మార్పున్నువ్వావగలవని సందేహిస్తున్నావ్? మనసుని ఎంత లయం చేసినా వీచేగాలి, ఊగే పూలూ మారుతాయా? ఇద్దరివీ రెండు గమ్యాలు.

పోనీ – నాలోంచి నువ్వూ, నీలోంచీ నేనూ

నడుచుకుంటూ పోతాం. ఏంటట? నా కాళ్ళకి వెన్నెల అంటుకోనీ.. నీ కాళ్ళు రెండూ రాళ్లు తగిలి చిట్లిపోనీ.. ఏంటట?

❖ ❖ ❖

నా దుఃఖిత సహచరీ! గాయం గాయం ఒరుసుకున్నాక జీవితం మళ్ళా వికసిస్తుంది. కొత్తరక్తం కొంత పోగుచేయబడుతుంది.

ఒకవేళ రక్తమే మిగలకపోతే అప్పుడు కూడా నా మాటలనీ పునఃస్మరించుకో. నువ్వు నాలోకి నేనూ నీలోకి పారిపోదాం. శ్వాసక్కూడా తెలీకుండా జారుకుందాం.

నీకూ తెల్సుగా! మృత్యువుక్కూడా వికాసం తెలుసు. మనలాగే. మృత్యువుక్కూడా–

8

అప్పటివరకూ బాగానే ఉంటాను. కనిపించే ప్రదేశాలు, వినిపించే శబ్దాలూ, హత్తుకునే మనుషులు అంతా ఒక దృశ్యంలాగా ఊహించుకుంటాను. అన్నీ ఒక జీవితమైనట్టు ఉద్వేగపడతాను. ఊహకందనిదేదో రాత్రిలోకి వచ్చేసరికి చాలా సాధారణంగానే రోజు గడుపుతాను. చాలా సంతోషంగా ఉండాలనుకుంటాను.

అనుకోకుండా – అనుకోకుండా ఆ రాత్రిపూట – గాలికి బదులు వెలుతుర్లు వీచే ఆ రాత్రిపూట

విచారమొక భారంలాగా, నిగ్రహమొక ధ్యానంలాగా, సందేహమొక సంతాపంలాగా అనిపించడం మొదలవుతుంది. సంతోషమే విచారమై దిగంతందాకా తరుముతుంటుంది. కాళ్లు ఎప్పట్లాగే కట్టిపడేసి ఉంటాయ్. కాపాడడానికి ఎవరూరారు. భారాన్ని మోస్తూ, శ్వాసల్ని తీస్తూ మత్తుని కలిగించే నిమిషాల కోసం మసకదేవుళ్ళందరికీ ప్రార్థన చేస్తాను. మనసునీ, హృదయాన్నీ నివేదించుకుంటాను. ఫలితం శూన్యం.

వెన్నెల స్నేహితా! పిలిచీ పిలిచీ అలిసిపోయాక నువ్వే దిక్కని తెలిసిపోతుంది. నిశ్శబ్దశబ్దం గాయం చేస్తుంది.

వేళ్లకి అదుపులేదనీ – మనసుకి అలుపులేదనీ –
దూరం పెరుగుతోందనీ – భారం తగ్గుతోందనీ..

పారిపోవాలనే ప్రయత్నిస్తాను. ప్రయత్నిస్తూనే హత్తుకుంటాను. దుఃఖిత సహచరీ! దుఃఖమయ జీవితపు వీధుల నిండా ధూళికణల్లాగ నువు పరుచుకుంటావ్. దుమ్ములో ఒకసారి స్నానం చేసి స్వచ్ఛంగా నాలాగా తేలిపోతాను.

ఏం రాస్తానో అర్థం కాదు. మాటలూ రాతల్లాగే పేలవంగా తోస్తాయ్. రాతలూ మాటల్లాగే అనుభూతులు పంచుకుంటాయ్. నేను సశేషమని అనిపించినప్పుడల్లా రాతల్లో నీ రూపం వెతికి చూస్తాను. అక్షరాల్లో నిన్ను కలుసుకుంటాను.

అప్పుడప్పుడూ కలలోని నీ రూపాన్ని అందరిలోనూ పోల్చుకొని చూస్తాను. సింధువులేని నుదుటిపై నువ్వు గోచరిస్తావు. కోపంతో– నిశ్శబ్దానికి కాంతినీ, అదృశ్యానికి రాగాన్నీ ఆపాదించుకున్న వైచిత్రిలోంచే ''ఎక్కడి అరుణాస్పదపురమని'' పద్యమందుకుంటాను. కదల్లేని కాళ్ళకి మాటలు నేర్పచూస్తాను. బంధనంగా ఎవరికీ తోచని సంకెల నన్ను ఎంతగా హింసించేదీ పాడుకుంటాను.

ఇంకా..

ఇంతకుముందులా రాయలేనందుకు ఎప్పుడో ఒకసారి బాధపడతాను. ఇంతకుముందులా బాధలేనందుకు ఎందుకో కాస్తంత రాసిచూస్తాను. ఇంతకుముందులా బతకులేనందుకు అప్పుడూ ఇప్పుడూ నవ్వుకుంటాను. ఎంతకాలమనే ప్రశ్నలు తగిలి ఒంటరిగా ఒక్కన్నే ఏడ్చిచూస్తాను.

●

9

నువ్వుకూడా కోపగించుకుంటావ్. అందరిలాగే విసుగుచెందీ, విరక్తి చెందీ "నాలో ఏ మార్పులేనందుకు" దూరంగా పోవడమే మార్గమనుకుంటావ్. విడిపోయి బతకడమే మంచిదని అంటావ్.

వెలుతురుకి తడిసీ, వెన్నెలకి వెరసీ, చీకటితో కలిసొచ్చే చికాకుని ఏవగించుకుని – దుఃఖవస్త్రం తీసి ముఖమ్మీద విసిరికొట్టి, దుఃఖాన్నే వేటాడుకుంటూ దూరంగా వెళ్ళిపోతావ్.

కష్టాలు, కన్నీళ్ళు, దుఃఖాలు, శోకాలు మనకేదీ వద్దని సందేశమిస్తూ బతికిన బతుకు, గడిపిన కాలం సూర్యుని ఆదేశమని సూత్రీకరిస్తావ్. గతించిపోయిన మహత్వ, మధురత్వ, రమణీయదృశ్యమే అదృష్టమంటావ్.

గురుతుల్ని చెరిపీ, దుఃఖాన్ని వదిలి సరికొత్త దేహమై జన్మించమంటావ్. సరిపోని సంపదలు సాధించమంటావ్.

❖ ❖ ❖

మలుపుకోవాలనే ప్రయత్నిస్తాను.

మంచెమీద ఇద్దరం కావలికాసిన కలలు, ఎర్రమట్టితో అలికిన ఇల్లు, పూలుపూసే చెట్ల మధ్య వాలిపోయే నవ్వులూ, పాలకంకుల యవ్వన సౌందర్యాన్ని గిచ్చుకొని చూసుకున్న రోజులు.

వాగులో ఇద్దరం నగ్నంగా స్నానం చెయ్యడం, సూర్యునికాంతితో ఒళ్ళు తుడుచుకోవడం, ఆపై మళ్ళా ఒకసారి ముద్దుల్లో తడిసిపోతే దేవతలు దిష్టితీసి ఆశీస్సులివ్వడం, ఇసుకగూళ్లలో చేరి తలుపులేసుకోవడం

పొత్తిళ్ళలో నువ్వు పొదువుకున్నపుడు ఏడ్చిన ఏడ్పూ, నవ్విన నవ్వూ..

నీ చూపు, కనురెప్ప వేసినప్పుడల్లా నక్షత్రాలు రాలి విచ్చుకోవడం, కాటుకలోంచి కూడా కాంతి చిప్పిల్లడం, భూమి సిగ్గుపడే వసంతరాత్రిలో సవరించి పెట్టిన చీర కుచ్చిళ్ళూ, చేతివేళ్ళు నేర్చుకున్న సంగతులూ, పాడుకొని సరిచూసిన గమకాలు..

నీ ముద్దు, పడవలెక్కి తీరం లేకుండా పోయి గట్టిగట్టిగా అరవడం, చేపల్లాగా ఎగరడం, వెనకాలనుండి చేతులు వేస్తూ పసివాడిలా నీతో ఆడుకోవడం..

శృతి చేయబడని తనువుని మీటి ఆస్వాదించిన అపస్వరాలు, ఇద్దరం ఒకరిలో లీనమైపోవడం..

ఇంకా ఆ ఎడారి నడిమధ్యలో, కన్నీటి చెలమల్ని తేటపరుచుకొని పెదవులని తడిపి దాహానికోర్చడం, ప్రేమించలేకా, మోహించలేకా సరిహద్దురేఖలపై తచ్చాడిరావడం

అడిగినందుకో, మరెందుకోగాని

అన్నీ మలపాలనే ప్రయత్నిస్తాను. మనోఫలకం ఒప్పుకోదు. మనోవేదన తగ్గిపోదు.

❖ ❖ ❖

వెన్నెల స్నేహితా!

నిన్నేమి అనను. నువ్వు చేస్తున్న దేన్నీ ప్రశ్నించను.

నీకు దేహం కావాలి. సత్తువతో నిండిన దేహం, శుభ్రత నిండిన మనసు, స్వచ్ఛత నిండిన ఆత్మ కావాలి. మనం మనమై జీవించడం కావాలి. అనుభూతి సంపదని సృష్టించడం కావాలి.

ఏం చేద్దాం?! అవేవీ నా దగ్గరలేవు. ఉన్నదల్లా ఒక అనారోగ్యమైన దేహం, గాయాలు నిండిన మనసూ, వెలుతురు లేని ఆత్మ.

నీ అద్భుత హృదయంలాంటిదే నాకూ ఉంటే బాగుండు. దయతో సర్వదా ఉప్పొంగి ప్రవహిస్తే బాగుండు. ఈ విషాదాలు, నిషాదాలూ అన్నీ ఒకేసారి అంతమైతే బాగుండు. చిందరవందరగా పడిఉన్న ఊహలకి నిశాంతమేదైనా ఆవహిస్తే బాగుండు. కానీ –

కానీ ఏదీ జరగదు. ఒక పిచ్చి ఊహలో తప్ప ఏవీ ఎక్కడా అంతమవవు.

❖ ❖ ❖

దుఃఖిత సహచరీ!

మసకలోనె అడుగులేస్తాను. మసకలోనే తప్పిపోతాను. మసకలోకానికే జీవితం రాసిచ్చి ప్రయోజనం లేకుండా పరుగుతీస్తాను. గమ్యమేదైనా తారసపడుననే పిచ్చి ఊహతోటే చలించిపోతాను. శబ్దముఖతః నిన్ను నేర్చుకుంటాను. సంస్కృత హృదయుడనై సంచరిస్తాను. ఆత్మభాషల్లోన మాట్లాడనివ్వని సుప్తచైతన్యంతో యుద్ధం చేస్తాను. శుష్కవాచ్యాన్ని వెలివేసుకుంటూ – పువ్వులు, గువ్వలూ, ఆకాశాలన్నిటికీ ఓదార్పుతో నిండు లేఖలు రాస్తాను.

ప్రయాణం ఎప్పట్లా కొనసాగిస్తాను. అద్వితీయంగా స్ఫురితమైనట్టి ఆమెతోపాటే నిన్నూ కొలుస్తాను. ఆమెతో పాటే నిన్నూ భరిస్తాను. ఆమెతోపాటే ఆరాధిస్తూ – శక్తి ఉన్నంతవరకీ నడక ఆపొద్దని కాళ్ళని చేతుల్ని వేడుకుంటాను. తోవ తెలీకున్నా సాగిపోతాను. నిర్మల హృదయాన్ని చీల్చుకువచ్చే నిర్ధిష్ట వాక్యానికే కట్టుబడతాను.

❖ ❖ ❖

ఎంతచేసినా, ఎంత ఊహించినా అదృష్టమేదీ తోడురాదు. అనుకోకుండానే

అంధకారపు ప్రయాణంలో ఆకాశం సాక్షిగా మెరుపు మెరుస్తుంది. దారిచూపకుండానే ఆశరేపుతుంది. గుండెపైకెక్కి నువు చేసే ప్రచండ తాండవానికి అవయవాల సంచలనం అంతుపట్టదు. దుఃఖదగ్ధ హృదయాన్ని పరుచుకునే లోపే దేహం సమస్తం కాలిపోతుంది.

నువ్వు వెళ్ళిపోతావు.

అనుకోకుండా వచ్చిన నువ్వు అనుకోకుండానే వెళ్ళిపోతావు!

●

10

రాత్రులు నువు జోకొట్టడం మరిచిపోతానా!?

నిదర్రాదు. అంతటి వానలో ఏమీ తోచక అటూ ఇటూ క్రొవ్వొత్తులు వెలిగిస్తాను. రెపరెపల జ్ఞాపకాల మధ్య వెలుతురు దాగిపోయి, చీకటి చెలరేగడం చూస్తాను. దిగులు మేఘాలు, ఇసుక తుఫానూ కలిసి ఎడారి జలపాతమై ఎగసిపడటం చూస్తాను.

నువ్వూ దుఃఖం వేరుకాదని తెలుస్తుంది. నీ దేహం మీది చారికలకీ నా వీపుమీది నల్లటి మచ్చకీ ఒక ఆత్మీయ స్పర్శ. నా అధికారానికి నీ అనురాగపు సాంత్వన.

❖ ❖ ❖

దేశాలు పిలుస్తాయ్. ఒక దూరమేదో మరింత దగ్గర చేసి వాన సంకెలని తెగిపోకుండా చూసినందుకు ప్రపంచం నవ్వుకుంటుంది.

వెన్నెల స్నేహితా!

ఏ ఆవరణలో ఉన్నావో, ఏ మహత్తరమైన ఉత్సాహాన్నీ, త్యాగాన్నీ ఆనందంగా భరిస్తున్నావో, ఏ పరివర్తన కారణంగా నన్ను వెలివేస్తున్నావో, ఏ అంతర్యుద్ధపు గతాన్ని తలుచుకొని ప్రతి నిముషం నా కొరకు ఓడిపోతున్నావో, దాసిగా నా కాళ్ళపై సేద తీరుతున్నావో –

ఏది నైతికమని ప్రతిపాదించుకొని, పరిష్కృతమని ప్రకటించుకున్నావో, ఏ అసంతృప్త కాంక్షతో అనునిత్యం కాలి ఎలాగైనా కలుసుకోవాలని ఏడుస్తున్నావో, ఏ అమృతపు ధార కొరకు దోసిళ్ళు చాచుకొని వేచివున్నావో, ప్రార్థన చేస్తున్నావో

పరవాలేదనిపించే స్థితిలో వదిలి – ఏ మితితో ప్రభావాన్నీ, ప్రశాంతాన్నీ కొలవాలనుకున్నావో, పరస్పర చైతన్యాన్ని ఆపాదించుకున్నావో..

ఏ నిర్ధారిత భావనలమధ్య, స్వేచ్ఛాయుతమైన గాలిమధ్య, దైనందిన హృదయరోదనలమధ్య, అసందిగ్ధ క్షణాల నీడల మధ్యా నన్నింకా కావాలనుకుంటున్నావో..

❖ ❖ ❖

పువ్వులసంద్రమా!

ప్రాణం నిలవదు. పిచ్చికలల్నిండా నువ్వావహించి – కదిపి కదిపి నిద్రలేపిన ఉదయం మసక ఒక్కో పొరగా చీలిపోతుంది. వెలుతురు ఒక్కో రేఖై అలుముకుంటుంది.

ముళ్ళపొద మధ్యలో పూసిన పూలు గాలికి ఊగుతూ నవ్వుతున్నట్టు నువ్వూ నేనూ ప్రపంచాన్ని మర్చిపోతాం. నిటారుగా పాతుకున్న చెట్లు ఊగే కొమ్మల్ని వింటున్నట్టు నువ్వూ నేనూ పరవశించిపోతాం. నీతాకోకలు కొన్ని తప్పించుకుంటాయనీ, తప్పక వస్తాయనీ ఎదురుచూస్తాం. మౌనం అపరిమితమనీ, తప్పక సేదతీరుస్తుందనీ ఆశపడతాం.

విరహతాపానికి ఆషాడమేఘం కరిగిపోయేవేళ ఒక వర్షహేళతో నిన్ను హత్తుకోవాలనీ, ఒక మెరుపులాంటి నవ్వుతో నిన్ను ముద్దాడిపోవాలనీ అనుకుంటూనే – యవ్వనపు భూమ్యాకాశాల మధ్య ఊగిసలాడలేక ఒంటరిగా ఒక మిణుగుర్లు పూసే చీకటిలోయలోకి, దేహసరోవరంలోకి పారిపోతాను. నిన్నూ, దేవుణ్ణీ శరణు వేడినందుకు సంతోషపడతాను.

ఒక సాధారణ భాషలోనే పదాలన్నీ మాట్లాడినా ఒక ఉన్మత్త భాషలో పద్యం ముగిసిపోతుంది. ఉన్మత్త భావప్రవాహాల సాక్షిగా, నిప్పుల్ని రగిల్చే వానసాక్షిగా నేను నీవాన్ననీ, నీతోనే ఉండేవాన్ననీ ఒప్పుకుంటాను.

❖ ❖ ❖

దుఃఖితసహచరీ! దేహపంజరంలోకి పక్షుల్ని వదిలిందెవరో – టపటపా రెక్కలు కొట్టుకుంటే చప్పట్లు కొట్టిందెవరో –

ష్! గమ్మత్తైన గిలిగింతలకోసం నేనే ఓర్చుకొని ఉంటాన?

అలవాటు ప్రకారం వర్షం మొదలయ్యాక పక్షుల శబ్దం ఆగిపోతుంది. నక్షత్రయుక్త ఆకాశం గతకాలపు స్వప్న శిథిలం. నీటికీ నీటికీ దూరం ఎంతున్నా ప్రవాహాలు మాత్రం అలసిపోవు. మేఘం చరించినట్టూ, దేహం చలించినట్టూ ఎవ్వరికీ ఎప్పటికీ అంతుపట్టదు. ఒక మట్టిముద్ద విడివడి వరదలో కలిసి సార్థకమవుతుంది.

నాకు అర్థం కానిదల్లా పాపమే!

మనోగతి లిప్సికై, నాడులన్నీ నిరీక్షణా తంత్రులై, ఊపిరొక స్వేచ్ఛా వాయులీనమై వినిపించే సంగీతంలో –

విషాదమాధుర్యాన్నీ, విరహసందేశాన్నీ తనువుతీరా ఆస్వాదించుతున్నట్టూ, అర్థం చేసుకున్నట్టు – ఒక నాగరికత, సంఘమూ, విభజనేలేని కాలాతీత తీరాల్లోకి, ప్రాచీనత్వంలోకి, సంధ్యాతలంమీద నడిచిపోతున్నట్టూ..

కణజాలపు నెగళ్ళలో చలికాచుకుంటూ రాసిందే తిరగరాయించే కాలానికి వందనం.

●

11

నువ్వెవరని శోధించుకుంటాను.

దూరంగా వెళ్ళిపోతున్నందుకూ, అలజడిలో కొట్టుకుపోతున్నందుకూ, రాళ్లదారిలో ఒరుసుకుపోతూ

పిలవలేనందుకూ, కలవలేనందుకూ–

కోపంగా, బాధగా, వీలున్నంత అశాంతిగా నువ్వెవరిని శోధించుకుంటాను. ఎలా వచ్చావనీ, ఎప్పుడు వచ్చావనీ ప్రశ్నించుకుంటాను. నిశ్శబ్దాన్ని అనువర్తించుకునే అపూర్వ సంధ్యలో, ఎర్రటి పూదోట విచ్చుకునే ఆకాశ విస్మయంలో, మసక మసకగా మాధుర్యాన్ని పంచే సంధ్యావస్థకాల సాన్నిహిత్యంలో నిన్నూ, నన్నూ కలిపిన అక్షరాల్నీ పాటల్నీ ఒంటరిగా ఒక్కన్నే స్మరించుకుంటాను. ఒక్కొక్కరాత్రికీ గతించిపోతాను. ఎందుకు వచ్చావో అంతుపట్టక

నిద్రలేచి కూర్చున్న రాత్రి–

నిద్రపోనివ్వని ప్రతీకల నిండా విరిసే సన్నజాజుల పరిమళాల్లో, వెలసిన వర్ణాక్షరిలో, నువ్వు నాతో చెప్పలేక ఓర్చుకున్న మాటలేమన్నా ఉన్నాయేమోనని వెతికిచూస్తాను. తిరగేసిన చరిత్రనే తిప్పి చూస్తాను. మలిపిన పదచిత్రాన్నే మళ్ళీ గీస్తాను.

ప్రశ్నలపరంపరలో ఒక నేను–

నువ్వు నా ఏకాంత మందిరంలో ఎందుకు నాట్యం చేసేదీ, నా హృదయపు గదుల్లో ఎందుకు విశ్రమించేదీ, నా అంతర్నేత్రాకాశంలో ఎందుకు వెన్నెలై కాసేది కనుక్కోగలననే లెక్కవేస్తాను. తెలుసుకోగలననే బయలుదేరుతాను.

❖ ❖ ❖

వెన్నెల స్నేహితా!

నిజమే! గాలిని చీల్చగలనా? భూమిని దాటగలనా? వెన్నెల తోటల్లో వ్యాపించగలనా? నిన్ను ముద్దాడినంత ఉన్మత్తంగా పరిస్థితులని కూడా ముద్దాడగలనా? నిన్ను తాకినంత సుకుమారంగా కాంతిరేఖల్తో కోసుకోగలనా?'

ఏవెూ! వేళ్ళ చివరిదాక పాతుకున్న పిరికితనం ప్రయాణానికి ముందే సమాధానం కోరుతుంది. నిట్టనిలువుగా పాతాలనే చూస్తుంది. చూసీ చూసీ ఆపే వీల్లేని నిమిషాల్ని పిలిచి ఆకాశందాకా తనే ఎగరవేస్తుంది.

నువ్వు నా ధైర్యం. కొన్ని క్షణాల ఆలస్యానికి నీ మన్నింపు తోడు. నేను సిద్ధం.

వెన్నెల ఆవహించినవాడు ఊరుకుంటాడ?

ఆకాశమంతా ప్రవహించి వస్తాడు. చీకటి వీధుల్లో విహరించి వస్తాడు. సూర్యుని రథాన్ని ధ్వంసం చేసి 'నక్షత్ర వీధికి నాయకుండెవ్వడని?'– పద్యం పాడుకుంటూ ఊగిపోతాడు. నక్షత్రపు ధూళితో మాసిపోయి ఖగోళాన్నంతటినీ కనిపెట్టుకు వస్తాడు. చీకటి పువ్వుల్ని కోసుకువస్తాడు. కాంతిపరిమళాన్ని చూపుల్తో పంచే అద్భుతశక్తులేవో సాధించుకువస్తాడు.

వెన్నెల స్నేహితా!

దుఃఖ దగ్ధహృదయమే విశ్వాన్ని నడిపించే కారకమని తెలుసుకున్నవాడు నేలమీదికి జారిపడ్డా నిదురపోడు. క్షణానికి వేయి జ్ఞాపకాల్ని రగుల్చుకొని..

రోజురోజుకీ కొత్త రాత్రిని చేస్తాడు. రాత్రిరాత్రికీ నిన్ను రాణిని చేస్తాడు. తానే ఒక ప్రభువై దహించుకుపోతూ నీ ధ్యాసలోనే నిలిచిఉండాలని– సమస్త అవయవాల్ని ఆదేశిస్తాడు. తాపాన్ని ఓపమని వేడుకుంటాడు. తన్మయత్వంలో నిమగ్నమవుతాడు. సఫలం కాకున్నా సంతోషిస్తాడు.

❖ ❖ ❖

పువ్వుల సంద్రమా!

సంశయించకు. నువ్వూ ఆలోచించు. జరుగుతున్నదంతా అంతరాత్మ ఒక పూదోటగా మారి ఆలోచలన్నీ సీతాకోకలై చేరే ధ్యానం.

ఆలోచించు. పువ్వుల వికాసం నీలోనూ, సీతాకోక ఆనందం నీ మనసులోనూ దాగి ఉంది. ఏం చేయాలనేది నీకు తెలిసిందే. సాధనతో పనిలేదు.

నిన్ను నీ హృదయంలోకి ఇంకించుకో. నీ హృదయాన్ని శరీరమంతా స్పందించనీ. నువ్వూ నేనూ ఒకే రీతి కదలాడే అనునాద తరంగాల్ని గాలితో అల్లుకోనీ...

ఒక సంగీతాన్ని ప్రణవం చేసి, ఆపై మెల్లగా నిశ్శబ్దం చెయ్యి. సీతాకోక రంగుల్ని వెలిసేలా చెయ్యి. హృదయమే పువ్వై పూసేలా చెయ్యి. ఆత్మలో ఎట్లా లీనమవ్వాలో ఆలోచించకనే అన్నీ చెయ్యి.

❖ ❖ ❖

దుఃఖిత సహచరీ!

ఒక అనిశ్చిత బిందువుని వెతుక్కున్నాం. ఒక దుఃఖపు బిందువులో ఒదిగిపోయాం.

మనం దరిద్రులం. ఒకరిని ఒకరం చూడటం తప్ప ఏ సంపదలూ కోరనివాళ్ళం. ఒకరితో ఒకరం మాట్లాడడం తప్ప ఏ ఆశలూ లేనివాళ్ళం. ఒకర్ని ఒకరం హత్తుకోవడం తప్ప ఏ సంతోషమూ తెలియనివాళ్ళం.

ఇద్దరం కలవమని తెలిసీ– ఇంకా ఇంకా ఎందుకిక్కడ?

పోదాం. వదిలిపెట్టి వెళ్ళిపోదాం. ఈ నేలనీ, గాలినీ, ఊపిరిలో మంటరేపే మనుషుల్నీ, యోధుల్ని చంపుకునే రాజుల్నీ, వాళ్ళ రాజ్యాన్నీ, పిట్టల్ని రాల్చుకునే చెట్టునీ, దాని వసంతాన్నీ, అన్నిటినీ వదిలి..

అన్నం పెట్టిన చేతులన్నీ అంతే మృదువుగా ఉండాలని ప్రార్థిస్తూ –

స్వప్నంలోంచి యథార్థంలోకి, యథార్థం వధించే జీవితంలోకి, యుద్ధంలోంచి యుద్ధంలోకి, యుద్ధం పారించే రక్తంలోకి, సంధ్యని వంచించే పగళ్ళలోకి, రాత్రులు నివేదించే రోజుల్లోకి, బాధని పంచని ప్రపంచంలోకి, బాధగా మారే దేహంలోకి..

అందరినీ వదిలి, ఇద్దరమే...

●

12

ఇక్కడే ఉన్నా!

ఈ అందమైన ప్రపంచంలో, అందమైన పసిపాపల నవ్వుల మధ్య, ఇంకా అందమైన నీ గుర్తుల్ని ఒక్కొక్కటిగా పోగుచేసుకుంటూ

వెన్నెల స్నేహితా!

జీవితం నీకర్పించి – ఒక్కరోజునీ తిరిగి తీసుకునేందుకు ఎంతమాత్రమూ సంకోచం లేదు. నిన్ను అర్థించినా, అనుగ్రహించమని వేడుకున్నా అపరాధమేమి అగుపించడం లేదు.

❖ ❖ ❖

వెన్నెల స్నేహితా!

రాయినే. ఒకప్పుడంతా – శిధిల దేహాలయపు రాళ్లకుప్పనే. ధూళి తప్ప ఏదీ ముద్దాడలేదనీ, గాలి తప్ప ఎవరూ పలకరించలేరనీ ప్రతిరోజూ ప్రతిపూటా అనుకున్న వాన్నే. ఎండలు పేల్చే వేసవి, చినుకులు రాల్చే వాన.. ఋతువు ఏదైనా భరించినవాన్నే.

నీ స్పర్శాక ప్రాణస్పందన కలిగించేంత వరకూ నేనూ దేహం అంతా మిథ్య.

❖ ❖ ❖

వెన్నెల స్నేహితా!

ఎందుకు దిగులుపడ్డావ్? నలిగింది చర్మమే. మనసూ కాదు. శరీరమూ కాదు. నువ్వు నేనూ విడిపోవడం అసాధ్యం. పువ్వులూ, సెలయేర్లు, వెన్నెల, సీతాకోక... ఏదీ అక్కర్లే. దేన్నీ ఈసారి హింసించను. ఈ రక్తాస్థిమాంసాల పదార్థం మన ఉనికి. ఇద్దరం ఒకటనే ఆలోచనే శ్వాస. ఇంతా తెలిసీ ఎందుకు దిగులు?

❖ ❖ ❖

వెన్నెల స్నేహితా!

గాలి అల్లంతదూరాన నిలబడిపోతుంది. ఎటూ కదల్లేక నిశ్శబ్దంలోనూ, ఏకాంతంలోనూ లీనమై– ఒకర్నొకరం నిర్విచారంగా చూసుకున్న ప్రతిసారీ..

దుఃఖం ఉబికి వస్తుంది. దుఃఖం ఒక మాయాస్పర్శతో తలనిమిరి జన్మల సాంగత్యాన్ని గుర్తుచేస్తుంది. విధించుకున్న ఒంటరితనంలో కదలని వేళ్ళూ, కలవని కాళ్ళూ కదులుతున్నట్టూ కలవమన్నట్టూ..

ఒక సందేశమేదో మనసుకు చేరుతుంది. సహనం లేని యవ్వన సంధ్యని వదిలి, రగుల్చుకున్న రక్తాంధకారంలో ఒక పిలుపు ఏదో కలిచివేస్తుంది. బాధాకలిత ప్రపంచ దృశ్యంలో ఇద్దరి ఆశలకీ చోటుండదు. ఇద్దరి తపనలకీ విలువుండదు. ఇంతా తెలిసీ ఎందుకు బాధ?

❖ ❖ ❖

వెన్నెల స్నేహితా!

మాట్లాడు. వెక్కి వెక్కి ఏడ్చేబదులు ఒక్కమాటన్నా మాట్లాడి చూడు. గట్టిగా హత్తుకొని ఓదార్చిచూడు. నీలాగే పగిలిపోయిన గుండెని – మాటలేవన్నా అతికించగలవో చూడు.

దుఃఖిత సహచరీ!
నన్ను బతికించగలవేమో చూడు..

●

13

అడిగేవారుండరు

దాహంతో బతుకుతున్నా, ఆకలితో చస్తున్నా, ఊపిరాడని స్వప్న వైచిత్రిలోనే స్వర్గనరకాల మధ్య ఊగిసలాడుతున్నా గాలిని చీల్చుకొని గాయపడుతూ, అందని వెన్నెలకై అడుగులు వేస్తూ, బాధేలేని క్షణాల జాడలో ప్రపంచమంతా సంచరిస్తున్నా నరాలు చిట్లే ఏకాంత సంగీతాన్ని ఆనందిస్తూ ఆనందిస్తూ అలసిపోతున్నా

ఏ ఒక్క మనిషికి అర్థం కాను. ఏ ఒక్క మనిషికి భారం కాను. నిలవనీడలేదనో, ఆధారంలేని అనాథ పక్షిననో ఏమన్నా అనుకోనీ.. ఆకలిరాత్రుల స్నేహితున్ననీ, అసలే మనిషిననీ, అబద్ధమింకా అలవాటు కాలేదనీ, అసలేమీ లేనివాన్ననీ, అందుకే ఏదో వెతుకుతున్నాననీ వాళ్ళందరూ ఏదన్నా చెప్పుకోనీ –

వెన్నెల స్నేహితా!

ఎవడికి తెలుసు? ఏం కావాలో ఎవడికి తెలుసు? దేనికొరకు తపించిపోయీ వెర్రెత్తిపోయీ కాలాగ్నిలో దహించుకుపోయేదీ, కాలాతీతస్థితిని కలలుగనేదీ ఎవడికి తెలుసు?

❖ ❖ ❖

వెన్నెల స్నేహితా!

చెప్పలేనంత విషాదంతో పగళ్ళూ, ఒప్పుకోలేనంత విరహంతో రాత్రులూ గడుస్తాయ్. తప్పుకోలేనంత నిస్సత్తువగా రోజులకి ఎదురుపడ్తాను.

యవ్వనం బతకనీయదు. ఉదయాలు నిద్ర ఒడిలో ఓర్చుకున్నా, సంధ్యని తేనీటితో కాచుకున్నా రాత్రికి మాత్రం దొరికిపోతాను. ఒక్కడినై – ఒక్కో నిమిషానికి కాలిపోతాను.

నిమిత్తమాత్రం బతికిపోతానన్నా నిమిషాలక్కాస్తకూడా దయ ఉండదు. నిమిషాల్తో గెలవడం సాధ్యపడదు.

అర్ధరాత్రి ఆకాసపు అంచులో, ప్రాణంపోతున్నట్టే ఉంటుంది. మేఘాలు కోసుకుపోతున్నా చీకటి కమ్ముకుపోతున్నా, నక్షత్ర శిధిలాలు దేహంలోంచి అటూ ఇటూ దూసుకుపోతున్నా

ఎవరెవరో ఈడ్చుకుపోతారు. ఎక్కడికో తీసుకుపోతారు. ఏదీ మాట్లాడరు. నన్నేది మాట్లాడనివ్వరు.

వెన్నెల మీదికి చేరతాననేమో– మౌనంతో పెదాలు నింపుకుంటాను. అయస్కాంతాల్లాంటి ఆలోచనల తీవ్రతకి సూదంటు రాయిలా మారిపోతాను. ఎక్కడో–

ఎక్కడో నక్షత్రం పగిలినచోటా, చీకటి పువ్వులై పూసిన చోటా ప్రయాణం అర్ధంతరంగా ఆగిపోతుంది.

ఏడ్చి ఏడ్చి నేలరాలాక – తేలికపడ్డానని అనందిస్తాను. తెలియకపడ్డానని సర్దుకుంటాను. దుఃఖపు బిందువుల జోలపాటలో హాయిగా పసివాడిలా నిదురపోతాను.

❖ ❖ ❖

దుఃఖిత సహచరీ!

ఉదయాన్ని చూసి ప్రపంచమంతా సంతోషించినా–

సూర్యుడు నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంటాడనీ, వెలుతురు ఉన్నపుడే శరీరాన్ని తపింపజేయాలనీ, మోహతప్త హృదయంతో పరుగెత్తీ పరుగెత్తీ ప్రియమైన చీకటి కోసం–

పవిత్రమైన రాత్రిముందు– జీవచ్ఛవమై మోకరిల్లే వాడి దరిద్రాన్ని గురించీ.. రక్తపుచుక్కల్ని అక్షరాలు చేసి కాగితాల మీద పారేసుకొనే వాడి అసహనాన్ని గురించీ..

నిజమే.. ఎవరైనా ఏం చెప్పుకుంటారు?

●

14

రావడం, పోవడం అబద్దం. కలవడమూ, విడిపోవడమూ అబద్దం. జన్మాంతరాల దుఃఖమే సాక్షి. పరిచయం, స్నేహం అబద్దం. పాపం, పశ్చాత్తాపం పనికిరానివి. ఎంత ప్రయత్నించినా ఓడిపోనివి. బంధాలూ, బాధలూ స్పృహకోసమే. ఇద్దరం ఒకటన్న స్పృహకోసమే.

❖ ❖ ❖

వెన్నెల స్నేహితా!

అద్వితీయమైన స్పృహ కలిగినప్పుడే అన్ని సంకెలలూ తెగిపోయ్ ఉంటాయ్. అమ్మా, నాన్నా, అక్కా, చెల్లీ ఎవరూ లేరు. నరాల్ని నరాల్తోనూ కండరాల్ని కండరాల్తోనూ నువ్వు పెనవేసుకుపోయావ్. నువ్వొక్కతివే జీవిత పరమార్థంగా తోస్తున్నావ్. స్వర్గ నరకాల మధ్య ఊగినలాడే స్వప్నవైచిత్రిలోసాయం చేస్తున్నావ్.

వెన్నెల స్నేహితా!

నీతో గడిపిన ప్రతీ క్షణంలో నేర్చుకున్నదెంతో నాకే తెలుసు. నీతో నడిచిన ప్రతీ అడుగులో ఏ తీరం చేరిందీ నాకే తెలుసు. నన్నేదో చేసావని ఎన్నటికీ ఎప్పటికీ బాధపడలేను. బహుశా

నువ్వు పెదాల్ని గాయపరిచినందుకే మాటలింత మృదువుగా వెల్లువెత్తుతున్నాయేమో. నువ్వు గుండెని పగలగొట్టినందుకే మనుషులింత సులువుగా ప్రవేశించగలుగుతున్నారేమో. నువ్వు దేహాన్ని వెలివేసినందుకే గాలి ఇంత హాయిగా అనిపిస్తున్నదో ఏమో!

❖ ❖ ❖

వెన్నెల స్నేహితా!

అడగాలనికాదు గానీ– మసక నాకేనా? లోకానిక్కాదా? జీవితం మసకబారి మసకలోకమన్నిందిస్తున్నానా? ప్రశ్నల పరంపరలో వేల శరీరాలుగా చీలిపోతూ – నన్ను నేనే హింసించుకుంటున్నానా?

ఏమో! జీవితమ్మీద నాదైన ముద్ర వేసుకోవాలనుకోవడం పొరపాటేమో. జీవితం తెలివైందేమో. దానిక్కావల్సింది దానికి తెలుసేమో. నీ ఎడబాటు నాకు తగిన శిక్షేనేమో.

వెన్నెలస్నేహితా!

దూరంగా పోతున్నామని దిగులు చెందకు. పిలుపు ఏదన్నా రావాలనుకొని శూన్య నిశ్శబ్దంలో వేచి చూడకు. బతికుంటే–

శూన్యంలోతుల్లోకి నిష్క్రమించినవాడే బాధమయ
అనంతానికి ప్రభువై తిరిగివస్తాడు. నిరంతర దాహార్తితో
అలమటించినవాడే అమృతాన్ని పంచిచ్చే దివ్యత్వం
సంపాదిస్తాడు. స్వప్నంలో కూడా– సుఖదుఃఖానుభూతులు
చెదిరిపోలేవన్న ఎరుకతో ఉన్నవాడు–
మట్టినిమరవన్నీపాదాలచెంతనే నిత్యచైతన్యంతో తనువు
చాలిస్తాడు.

❖ ❖ ❖

వెన్నెల స్నేహితా!

నా దుఃఖం నీ కళ్ళని మసకజేస్తుంది. నీ నవ్వు నా పెదవి చివర కాంతులీనుతుంది.

నువ్వు దేహం. నేను ఆత్మ. బహుశా ఇద్దరి గమ్యం ఒకటే. నువ్వు నన్నూ నేను నిన్నూ చేరుకోవడం.

ప్రేమ ఒక వారధి. ప్రేమించడం గమనం.

వెన్నెలస్నేహితా!

ఈ మహామృత్యుసాగరాన్నీ, అలలుఅలలుగా హృదయాన్ని తాకే జీవచైతన్యాన్నీ దాటి ఎవ్వరమూ ఎక్కడికీ పారిపోయే వీల్లేదు. క్షణం క్షణం జీవించాలి. క్షణం క్షణం ప్రేమించాలి. క్షణం మన అంతరాకాశంలో తళుక్కుమనే నక్షత్రం. ప్రస్తుత జీవితమే మన అనంతయాత్ర.

దుఃఖిత సహచరీ!

వీరాధివీరుడెవడో నీలో లయించిపోతున్నాడు. నిత్యయుక్తుడై నిన్ను స్మరించుకుంటూ నేర్చుకున్న రసవిద్యనంతా నీ కణాల్లోకి చొప్పిస్తున్నాడు. నిన్ను స్పర్శిస్తే పొందే తన్మయత్వాన్నే అనంతత్వమని భావించుతున్నాడు. నీ తేజస్సులో వ్యాపించి, నీ రక్తంలో ఐక్యమై, నీ అంతఃశాంతిలో అంతమవుతున్నాడు.

లేకపోనీ, వాడసలే లేకపోనీ. నీ హృదయంలో పూసే ప్రతీపూవులో, చూపులో వీచే చైతన్యవీచికలో, నీ మాటల వర్షాక్షరిలో..

వాడి ఆనవాళ్ళు మిగిలి ఉంటాయి.

నిత్య సంతోషుడై వాడు నిలిచి ఉంటాడు.

●

15

ప్రశ్నించుకున్నా ఒకసారి–

తనకోసం ఏం చేసానని..

ఒకసారెప్పుడో..

అడవి మధ్యలో దారితప్పినపుడు –

అడుగుల్లో అడుగేస్తూ ఆమెను వెంబడించాను. ఊరిపొలిమేర దాకా తరుముకొచ్చాను. వెన్నెల దారికి చేరువకాగానే, ధూళిలో ధూళిగా కలిసిపోయాను.

ఇంకోసారి–

నిద్దట్లో లేపి తీరని మోహంతో చుట్టుకున్నాను. జీవన మధువుని పంచుకున్నాను. అలసట తెలీని పాటలు నేర్పి దుఃఖోదయంలో వదిలివేసాను.

మరోసారి – తేటనీళ్ళని చూస్తూ, తను ప్రశాంతంగా కూర్చున్నపుడు...

గులకరాయివేస్తే ఆకాశమెట్లా చెదిరిపోయేదీ చూపించి నేను కూడా చెరిగిపోయాను.

❖ ❖ ❖

ఒప్పుకోదు గాని.. ఆమెకదంతా ప్రేమే. కోపం రాదు. బాధకి భయపడదు.

జన్మలుగా నీ కోసం వేచి ఉన్నాననీ, ఆరాధిస్తున్నాననీ,

నీ అనంతమైన సౌందర్యంతో నన్ను ఆవహించమనీ వేడుకుంటుంది.

నేనొక పిచ్చివాన్ని. రోజంతా ప్రార్థించినా నాకేదీ పట్టదు.

❖ ❖ ❖

ఎడతెగనిరాత్రినిండా ఎడతెరిపిలేని వర్షం. సముద్రం ఉవ్వెత్తున ఎగిసిపడుతుంది. రక్తనదులన్నీ హృదయాంతరాల్లోకి ఎనలేనివేగంతో పరుగులుతీస్తాయ్.

ఉరుములూ, మెరుపులూ, నవ్వులూ, ఏడ్పులూ...

గాలిలో ఆమె చరిస్తుంటే, ఉచ్ఛ్వాస, నిశ్వాసల్లో ఆమె సంచలిస్తుంటే నా సమస్త ప్రపంచాన్నీ తనే రచించినట్టూ గోచరిస్తుంది. ఆమె సర్వవ్యాప్తమనీ, నా స్మృతిపథమంతా తనే విస్తరించి ఉందనీ అర్థమవుతుంది.

❖ ❖ ❖

పగటిలోకి నిస్సిగ్గుగా వెళ్ళిపోతానుగానీ..

ఆమె ఒక దుఃఖ స్వప్నం. సమస్త దుఃఖజగత్తుకీ యువరాణి దుఃఖితున్ని లాలించడం, దుఃఖగీతిని మననం చేసుకుంటూ అదృశ్యంగా అతనికి జోలపాడటం, దుఃఖస్పర్శతో అతన్ని మేల్కొలపడం.. అన్నీ ఆమెకి సంతోషం కలిగించే విషయాలె.

నేనూ ఒప్పుకోను గాని–

ఆమె ఎన్నటికీ వినుగుచెందకపోవడమే నా అదృష్టమంతా..

●

16

చాలా చాలా అనుకుంటాం.

దూరంగా ఉండగలమనీ, దూరాన్ని తుంచగలమనీ, ఏదనుకుంటే అది ఎప్పుడైనా చేయగలమనీ... అన్నీ మాటలే. విరహపు బాధ జీవితమంతా విస్తరించాక– ఏం మాట్లాడాలో అర్థం కాదు. ఏది చేయాలన్నా మనసు రాదు.

గుండెలు పగిలి ఏడ్చేదాకా ఏ ఒక్కరోజూ నిద్రపట్టదు. ఏ ఒక్కరోజూ కలలు తీరవు. లయించి లయించి ఒరిగేదాకా ఏ ఒక్క క్షణమూ తృప్తినివ్వదు.

వెన్నెల స్నేహితా!

లయ తప్పడమొక అదృష్టం. పసిపిల్లలకూ మనకే పట్టే పట్టరాని అదృష్టం.

హృదయం లయ తప్పితే పాట స్వరం తప్పుతుంది. అనుభవాల్లాంటి చరణాలన్నీ అప్పటికప్పుడే అంతమైపోతాయ్.

పల్లవించే బతుకురాగం పాడీపాడీ అలిసిపోయాక– ఊపిరి నిన్నూ నన్నూ నిశ్శబ్దం చేస్తుంది.

వెన్నెల స్నేహితా!

ఊపిరివృత్తం నుంచి విసిరివేయబడ్డాక ఏ దిక్కూ అగుపించదు. ఏ మనిషీ కనిపించడు. ఇదిగో, ఈ నల్లని కాంతిరేఖ మనమార్గం. దీని మీదనే మనం కాలాన్ని దాటుకొని వెళ్ళగలగాలి.

అదిగో, ఆ రక్తపు చారిక చేరగలిగితే మనమూ, మన ప్రయాణమూ ముగిసినట్టే.

వెన్నెల స్నేహితా!

హృదయం విచ్చుకోవడం అనాది. హృదయం బద్దలవడమే అర్హత. చివరిదారిలోకి చేరాం గనక ఎలా నడిచినా ఎవరూ చూడరు. ఎంత ప్రేమించినా ఎవరూ అడగరు. ఏ తప్పటడుగూ సరిచేయబడదు. నక్షత్ర రాశి అస్తమించినట్టు – నువ్వూ నేనూ అస్తమించేదాకా రాళ్ళెట్ల వికసించేదీ, పువ్వులెట్లా బద్దలయ్యేదీ రహస్యం.

కృతజ్ఞతలు

ఆత్మీయ సహచరులు–

కవి యాకూబ్
కట్టా శ్రీనివాస్
డా॥ పులిపాటి గురుస్వామి
పూర్ణిమా సిరి, విజయభానులకి..

ఆశీర్వదించిన నౌడూరి మూర్తి
దీవి సుబ్బారావు, హెచ్చార్కెకి..

ఆదరిస్తున్న సంపాదకులకీ
సాయితగాండ్లకీ..

Neelage Okadundevaadu!

Nanda Kishore Poetry Anthology

కల్లోలాన్ని అనుభవిస్తూ
ఒక్కడూ ఏం చేస్తాడు?

తీరాన కూర్చుని
కెరటాల్ని గురించి కవిత్వం రాస్తాడు.
అలల మీదా నీటి తరగల నాట్యం మీదా
పదాలు అల్లుతూ పాటకడతాడు.

ఉప్పెన మీదికి వచ్చి ఊపిరి సలపకుండా చేస్తే
చేపపిల్లలాగా తుళ్లిపడతాడు.
అలలతోపాటే ఊపిరికూడా పోతే
ఇసుకలో గవ్వలా దాగిపోతాడు

సముద్రం వాన్ని ప్రేమించిందని
ఎవ్వరికీ చెప్పడు.
కల్లోలాన్ని వాడు కోరుకున్నట్టు
ఎవ్వరికీ తెలీదు.

తెలిసేదల్లా
వాడికలేడనే!